VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ :ఆదివారం,23.08.2026

సంపుటి : 09 సంచిక : 75 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్



**తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**లండన్ వెలుతురు ఆగస్టు 22:**

హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ మేరకు లండన్ యూనివర్సిటీ సెనే ట్ హౌస్‌లో సీఎం రేవం త్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం అయింది.

2

# జర్నలిజం కేవలం వ్యాపారం కాదు అదొక సామాజిక బాధ్యత





**పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం**

**హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం**

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్ రామ్, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు. వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్ర మం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.

▶ మిగతా 2లో

# సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

**ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారిగా జరుగుతున్న వర్క్ ప్రోగ్రెస్ ఇంకా మెరుగవ్వాలి**

**హై లెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలి**

**అధికారులు క్షేత్రస్థాయిలో ఇంకా బాగా పనిచేయాలి**

**ఆర్ అండ్ బి సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

రాష్ట్ర సెక్రటేరియట్ సోలార్ పార్కింగ్ ను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్ఐఎఫ్ ద్వారా నిర్మిస్తున్న రోడ్లు, సేతుబంధన్ పథకం బ్రిడ్జిలు, పురోగతిలో ఉన్న పలు ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఆదేశించారు.శనివారం నాడు సెక్రటేరియట్ లో రోడ్లు భవనాలు శాఖపై మంత్రి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.



2

# ఉద్యోగులను వేధిస్తే ఊరుకోం

**ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వార్నింగ్**

**వెలుతురు హైదరాబాద్, ఆగస్టు 22:**

ఈ రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారు. ఉద్యోగులను వేధించినా.. ఇబ్బంది పెట్టినా మేము ఎట్టిపరిస్థిల్లో మేము ఊరుకోమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి వార్నింగ్ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రం కోసం ముందుండి కోట్లాడిందే ఉద్యోగులు. తెలంగాణ ఉద్యోగులను కేసీఆర్ మన్మోహన్ సింగ్ కు కల్పించినప్పుడు...




2

## విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ సర్కార్ చెలగాటం



- **పాలకులకు విదేశీ టూర్ల మీద ఉన్న శ్రద్ధ విద్యావ్యవస్థ మీద లేదు: బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
- **తెలంగాణ విద్యార్థులకు బాసటగా బీజేపీ: "ఫీజుల బకాయి – బీజేపీ లడాయి" పోస్టర్ విడుదల**
- **ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించకపోతే ప్రభుత్వ మెడలు వంచుతామని బీజేపీ హెచ్చరిక**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

11

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

**భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి**

**ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు**

**రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం**

**నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన**

**ఉమ్మడి నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన**

**నిజామాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



2

## జగన్మాత అనుగ్రహం దేశ ప్రజలందరిపై ఉండాలి: తెలంగాణ గవర్నర్ శుక్లా ఆకాంక్ష

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

**జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం భక్తులు, దేశ ప్రజలందరిపై ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు.**

2



## నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం

- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.




2

## ఆటోడ్రైవర్ల బంద్‌కు సంపూర్ణ మద్దతు

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**వెలుతురు హైదారబాద్ ఆగస్టు 22:**

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఈనెల 24 నుంచి తలపెట్టిన బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ) సహా పలు ఆటో యూనియన్ ల నాయకులతో కలిసి బంద్ పోస్టర్ ఆవిష్కరించారు.



2

## పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

**ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపు**

**2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం**

**టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు... సాగునీటి నుంచి ఆహార శుద్ధి వరకు అపార అవకాశాలు**

**హైదరాబాద్‌కే పరిమితం కాని అభివృద్ధి.**



9

**జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి**

**మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 – సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్)కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.com మెయిల్ కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ. లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.



## ఆదిలాబాద్ ఐటీ టవర్‌తో ఐటీ విస్తరణకు మరో ముందడుగు: కేటీఆర్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి ఆదిలాబాద్ ఐటీ టవర్ మరో ముందడుగు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

10

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుంది

**కోర్టులో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



10

▶ మిగతా 11లో

## హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్

లండన్ యూనివర్సిటీలోని సెనేట్ హౌస్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ అధికారులు కే. రామకృష్ణారావు, జయేశ్ రంజన్‌లు పాల్గొన్నారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులతో వారు సుదీర్ఘంగా సమావేశమయ్యారు.ఈ భేటీలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్)కు చెందిన ప్రతినిధి బృందాలు, ఇతర ప్రతినిధులు కూడా ఉన్నారు.హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, వివిధ విద్యా కార్యక్రమాలను అందించేలా ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు.లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

## సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

ఈ సమీక్షలో ఉన్నతాధికారులు, ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేయనున్న షెడెడ్ పార్కింగ్ (సోలార్ కార్ పార్కింగ్) పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. సెక్రటేరియట్ కు ఉత్తర భాగంలో చేపట్టిన పనుల పురోగతిని మంత్రికి ఇంజినీర్లు వివరించారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు మొత్తం సచివాలయం బిల్డింగ్ మూడు వైపులా (ఉత్తరం,పడమర,దక్షిణం), ఎలివేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా, బిల్డింగ్ స్ట్రక్చర్ వరకే సోలార్ పార్కింగ్ ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం..సచివాలయ ఉత్తర భాగంలో రెండు వరుసల్లో,దక్షిణ భాగంలో మూడు వరుసల్లో,పడమర భాగంలో ఒక్క వరుసలో సోలార్ ప్యానెల్స్ తో కూడిన కార్ పార్కింగ్ డిజైన్లు ఉండేలా చూడాలన్నారు. సంబంధిత డిజైన్లు అధికారులు మంత్రికి చూపెట్టారు. రూ. 26.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన సోలార్ కార్ పార్కింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్ కోసం 90వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఈ విద్యుత్ వినియోగం ద్వారా సచివాలయ నెలవారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు.సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలనీ,ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారిగా జరుగుతున్న వర్క్ ప్రోగ్రెస్ ఇంకా మెరుగవ్వాలనీ అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటి వరకు 3,918కి.మీ రోడ్లు, రూ.5159 కోట్లతో 316 పనులు మంజూరు చేశామని అందులో కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, చాలా వరకు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. 2025-26కు సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నదని అధికారులను మంత్రి ప్రశంసించారు. పలు హై లెవెల్ బ్రిడ్జిలు,రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలనీ సూచించారు.సేతుబంధన్ పథకం ద్వారా 76 కోట్లతో చేపట్టిన నార్కట్ పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. మిర్యాలగూడ,నందిపహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని,దానికి సంబంధించిన టెక్నికల్ అంశాలు తక్షణం పూర్తి చేయాలని, స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సి.ఈ వనజను ఆదేశించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి పనుల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంకా బాగా కష్టపడి పనిచేయాలని, మెరుగైన రోడ్లు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యంలో అత్యంత కీలకంగా వ్యవహరించాలని అధికారులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉద్యోగులను వేధిస్తే ఊరుకోం

తెలంగాణ కోసం మేము కొట్లాడుతున్నామంటే ఆయన ఆశ్చర్యపోయారు. ఉద్యోగులకు ప్రత్యేక రాష్ట్రం మీద ఉన్న ప్రేమను మన్మోహన్ సింగ్ ఆనాడు మెచ్చుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మోసం చేస్తే ఎలా...! మూడు నెలల నుంచి ఉద్యోగుల నుంచి 1.5 జీతం కట్ చేస్తున్నారు, పబ్లిక్ డొమైన్‌లో మాత్రం పెట్టడం లేదు. ఈహెచ్ఎస్ లేదని ఆసుపత్రి నుంచి ఉద్యోగులను బయటకు పంపిస్తున్నారు. మూడు నెలల నుంచి ఉద్యోగస్తుల నుంచి ముక్కు పిండి కిస్తీలు వసూల్ చేస్తున్నపుడు ఆసుపత్రిలో ఆరోగ్య కార్డు ఎందుకు పని చెయ్యడం లేదని నిలదీశారు. నెలకు 2 వేల కోట్ల రూపాయల రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇస్తున్నామని ప్రభుత్వం అబద్ధం చెప్తుంది. పీఆర్సీ, డీఏలు ఈ ప్రభుత్వంలోనే అత్యధికంగా పెండింగ్లో ఉన్నాయి. నాలుగు లక్షల 90 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు , 4 వేలకు పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఈ ప్రభుత్వం మోసం చేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల వెయ్యి కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయి, ఎవరు తిన్నరో బయట పడాలి. కాంట్రాక్ట్ ఉద్యోగుల వెయ్యి కోట్ల రూపాయల డబ్బులు ఒక మంత్రి తిన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాల్సిందే...! ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ లో 3 లక్షలకు ఒక లష్కర్ పోస్ట్ అమ్ముకున్నారు. నీళ్లు దోచుకొని పోతున్నారు, ఉద్యోగాలు దోచుకొని పోతున్నారు... కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈరోజు రాష్ట్రానికి దిక్కయింది . అన్నారం, సుందిళ్ల బ్యారేజిల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేవనీ సీ డబ్ల్యూ పీ ఆర్ ఎస్ తన నివేదికలో స్పష్టం చేసింది ఈ నివేదిక రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరంపై ఇంతకాలం చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది. సమానపనికి సమాన వేతనం ఇస్తున్నామని అంటున్నారే తప్పా.... క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఏ ఒక్క రిటైర్డ్ ఉద్యోగి చనిపోయిన ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సీపీఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో పెట్టారు... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్ల అవుతుంది దానిని ఎందుకు రద్దు చేయడం లేదు. సీపీఎస్ రద్దు చేసేంత వరకు ఉద్యోగుల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## జగన్మాత అనుగ్రహం దేశ ప్రజలందరిపై ఉండాలి: తెలంగాణ గవర్నర్ శుక్లా ఆకాంక్ష

శనివారం హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో జగన్మాత రాజరాజేశ్వరీ లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం కోసం నిర్వహించిన "శ్రీ విద్యా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం"లో గవర్నర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, భారతీయ మహిళలు కుంకుమార్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం మన సనాతన సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీక అన్నారు. భారతదేశ పురోగతి, లోకకల్యాణం, విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞం ద్వారా జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి కృపాకటాక్షాలు దేశ ప్రజలు, భక్తులందరిపై ప్రసరించాలని ఆకాంక్షించారు.స్వామి అభిషేక్ బ్రహ్మచారి మహారాజ్ మాట్లాడుతూ, దేశ పురోగతి, అభివృద్ధి కోసం భారత ప్రభుత్వానికి మరింత శక్తిని ప్రసాదించాలని మాత లలితా త్రిపుర సుందరిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 తర్వాత భారతదేశం ప్రపంచ వేదికపై గణనీయమైన పురోగతి సాధించి, అంతర్జాతీయంగా గొప్ప గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. భారతదేశ పురోగతి, లోకకల్యాణం, విశ్వశాంతి, అణగారిన వర్గాల అభ్యున్నతి, దేశ ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తునారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాయజ్ఞంలో "లలితా సహస్రనామం" కోటి సార్లు పారాయణం చేయడంతో పాటు, సువాసినీ స్త్రీలతో కలిసి కుంకుమ, సింధూరాలతో మహా కుంకుమార్చన నిర్వహించనున్నారు. అమ్మవారికి కోటి సంఖ్యలో కుంకుమతో అర్చనలు చేయడం ఈ యజ్ఞంలోని ప్రధాన క్రతువుగా నిర్వాహకులు తెలిపారు.వారణాసికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు స్వామి అభిషేక్ బ్రహ్మచారి మహారాజ్ ఆధ్వర్యంలో జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం, లోకకల్యాణం, అఖండ భారత్ సాధనను ఆకాంక్షిస్తూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 57 మహాయజ్ఞాలు నిర్వహించగా, హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన మహాయజ్ఞం 58వది. యువ చేతన నేషనల్ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# జర్నలిజం కేవలం వ్యాపారం కాదు అదొక సామాజిక బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని ఆయన చెప్పారు. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్లించారని అన్నారు. మూక్ నాయక్, బహిష్కృత భారత్ వంటి పత్రికలను బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని అన్నారు. కేసరి, మరాఠా పత్రికల ద్వారా లోకమాన్య బాల గంగాధర్ తిలక్ వలస పాలకులను సవాలు చేశారని అన్నారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారంతా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలిచారని ఆయన కొనియాడారు. ఆ కాలంలో అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయని చెప్పారు. ప్రజాస్వామ్యంలో పాలకులకు, పత్రికలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఒక చారిత్రక సంఘటనతో ఉపముఖ్యమంత్రి వివరించారు. 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ, స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని ఆయన హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ... ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో... జర్నలిస్టులకు అసలైన ఆస్తి 'విశ్వసనీయత' మాత్రమేనని ఉద్ఘాటించారు.కొత్తగా ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో టీచర్ లేకపోయినా, ఆసుపత్రిలో డాక్టర్ లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా రిపోర్టర్ల ద్వారానే అని, వారే ప్రభుత్వానికి 'అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అని ఆయన కొనియాడారు. మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన జర్నలిస్టులకు భరోసా ఇచ్చారని అన్నారు. ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత అని భట్టి విక్రమార్క అన్నారు.జర్నలిజాన్ని రక్షించాలంటే జర్నలిస్టులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫెడరేషన్‌ను కోరారు. ముఖ్యంగా జిల్లా, చిన్న పట్టణాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. గ్రామీణ, జిల్లా స్థాయి జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం వంటి అంశాలను ప్రభుత్వానికి ముందుగా తెలియజేసేది తరచుగా స్థానిక జర్నలిస్టులేనన్నారు. "ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే.. మంచి జర్నలిస్టు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ వంటివారు" అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల స్వభావంలోనే స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సంప్రదాయం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఉద్యమాలు, సాహిత్యం, సంస్కృతిపై ఈ స్వభావం ప్రభావం చూపిందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత ఉందని, తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాలని అన్నారు. కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ కేవలం మరో సంస్థగా కాకుండా ఒక బలమైన సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు."అధికారంలో ఉన్నవారిని వదలకండి.. అదే సమయంలో మీ వృత్తి ప్రమాణాలను కూడా వదలకండి. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి. మిమ్మల్ని మీరు మీ ప్రమాణాలకు జవాబుదారీగా ఉంచుకోండి. ఈ రెండింటి ప్రయోజనం చివరికి పౌరుడికే దక్కాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ విజయవంతంగా ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.



## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రిగారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు శ్రీ సుదర్శన్ రెడ్డితో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ పుణేలో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" లైవ్ కార్యక్రమాన్ని మహేష్ కుమార్ గౌడ్ వీక్షించారు. విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశాలు, వారి సమస్యలు, భవిష్యత్ అవకాశాలపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హమ్దాన్, శేఖర్ గౌడ్, పీపీ దయాకర్ గౌడ్, మనాల మోహన్ రెడ్డి,నరాల రత్నాకర్, మజీద్ ఖాన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఆటోడ్రైవర్ల బంద్‌కు సంపూర్ణ మద్దతు




ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలు ఇచ్చి లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ప్రారంభించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ను ఇప్పుడున్న ఆటోడ్రైవర్లతో నడిపించాలని డిమాండ్ చేశారు. ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని.. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా ప్రభుత్వమే యాప్ తీసుకురావాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు.

### శిశువు మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కామారెడ్డి జీజీహెచ్ లో శిశువు మృతిపై ఎక్స్ (ట్విట్టర్)లో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన ఎక్కపల్లి తండాకు చెందిన గర్భిణికి సకాలంలో డెలివరీ చేయకపోవడంతోనే శిశువు మృతిచెందిందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు తరచు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. శిశువును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

# పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ



**విద్యుత్ కొరత లేని తెలంగాణే లక్ష్యం**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**






**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. తెలంగాణ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్, నీటి కొరత లేకుండా పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, పెట్టుబడి దారులు తెలంగాణలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆహ్వానించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి థర్మల్, సోలార్, హైడల్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి అన్ని మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాలను పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వేదికగా ఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్–2026ను ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ సాధిస్తున్న విజయాలు, తీసుకువస్తున్న సంస్కరణలు, ఆధునిక సాంకేతికతను ప్రజల కు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. బయటకు కనిపించకపోయినా రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ శాఖ ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని ఈ ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీ యంగా పెరిగినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గతంలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తు తం 18 వేల మెగావాట్లకు పైగా చేరినా, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేయడం, ముందస్తు ప్రణాళికలు, అవసరమైన విద్యుత్‌ను సమయానుకూలంగా సమీకరించడం వల్ల సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు అందువగలిగామని ఉపముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, 'పవర్ అంబులెన్స్' ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యల ను వేగంగా పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. 1912కు ఫోన్ చేసిన వెంటనే సమస్యను నమోదు చేసి పరిష్కరించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. అవసరమైన పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో సిద్ధంగా ఉండే పవర్ అంబులెన్స్ ద్వారా విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలకు తక్షణమే చేరుకుని పరిష్కరించే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ శాఖలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతూ ఇన్ హౌస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం అభినందనీయమని భట్టి కొనియాడారు. వినియోగదారుడి నంబర్ ఆధారంగా అతని లొకేషన్, విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి జరుగు తోంది వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడం విద్యుత్ సేవల్లో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకు ని 2047 నాటికి లక్ష్యాలను నిర్దేశించుకుని ఇప్పటి నుంచే ప్రణాళిక లు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి కనీసం నాలుగైదేళ్ల సమయం అవసరమవుతుందని అన్నారు. అందువల్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముంద స్తు ప్రణాళిక లు తప్పనిసరి అని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క స్పష్టం చేశారు. థర్మల్ విద్యుత్‌తో పాటు గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నామని, సోలార్, హైడల్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ రంగం వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం సహా ప్రతి ఉత్పత్తి రంగానికి పునాది వంటిదని, రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగినప్పటికీ, ముందస్తు ప్రణాళికల కారణంగానే ఆ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని ఆయన తెలిపారు. భవిష్యత్‌లోనూ రాష్ట్రంలో విద్యుత్ కొరతకు తావులేకుండా, పరిశ్రమల అవసరాలకు సరిపడే విద్యుత్ ను అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో పెండిం గ్‌లో ఉన్న ప్రమోషన్లను కల్పించడంతో పాటు, విద్యుత్ శాఖలో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి రూ. కోటి ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు.

ఉద్యోగులు, కుటుంబాల సంక్షే మం పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.విద్యుత్ శాఖ చేపట్టిన సంస్కరణ లు, విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. శాఖకు చెందిన యాప్‌లు, ప్రజాబాట కార్యక్రమం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, హైదరాబాద్‌లో చేపడుతున్న అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి కార్యక్రమాలపై ప్రజల కు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి



**మూడు రోజులుగా కొల్లాపూర్ నియోజక వర్గంలో విస్తృత పర్యటన**

**అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి**

**అధికారుల్లో జవాబుదారీతనం కొరవడితే సహించేది లేదు**

**రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారుల తీరుపై అసహనం**

**కొల్లాపూర్ వెలుతురు ఆగస్టు 22:**
ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలనే లక్ష్యంతో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వరుసగా మూడో రోజు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి.. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే, మరోవైపు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.

## స్టేడియాల నిర్మాణానికి కసరత్తు

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం పెంట్లవెల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో స్టేడియాల నిర్మాణానికి కసరత్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## మ్యూటేషన్లకు ఏళ్ల తరబడి తిప్పించుకోవడమేంటి?

అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించగా.. ఆయన ఓపికగా విని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మ్యూటేషన్ల కోసం దీర్ఘకాలంగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలపై మంత్రి జూపల్లి తీవ్రంగా స్పందించారు. ఏళ్ల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తే సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని మంత్రి తెలిపారు.

## ప్రజల ఆశీర్వాదమే బలం

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. 25 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నానని, ఏ రోజు ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, ఇంచు భూమి కూడా కబ్జా చేయలేదని, ఏ పనికీ ఒక్క పైసా తీసుకోలేదని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని, అందుకే ప్రజలు సుదీర్ఘకాలంగా తనను ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతగా పనిచేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని తెలిపారు.



# ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌పై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- **సుమారు 10 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం**
- **షట్‌డౌన్ లు ఆందోళనకరం**
- **రాష్ట్రానికి యూరియా సరఫరాలో**
- **నిరంతర అంతరాయాలు**
- **వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**
రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ప్లాంట్ ఆగస్టు 22 నుంచి మరోసారి షట్‌డౌన్‌లోకి వెళ్లడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కీలకమైన ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో ప్లాంట్ షట్‌డౌన్ కావడం రాష్ట్రానికి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాసి, తక్షణమే జోక్యం చేసుకుని యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ యూరియా అవసరాలను తీర్చడంలో రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. అయితే గతంలోనూ కీలక వ్యవసాయ సీజన్లలో ప్లాంట్ పలుమార్లు షట్‌డౌన్‌కు గురైందని గుర్తు చేశారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో మే 5 నుంచి జూన్ 14 వరకు 39 రోజులు, జూలై 10 నుంచి ఆగస్టు 4 వరకు 24 రోజులు, ఆగస్టు 14 నుంచి అక్టోబర్ 1 వరకు 49 రోజుల పాటు ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోయిందని, మొత్తంగా 112 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని వివరించారు.



ప్రస్తుతం ఆగస్టు 22 నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ మరోసారి షట్‌డౌన్‌లోకి వెళ్లిందని, సుమారు 10 రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఖరీఫ్ పంటల సాగు పనులు ఉధృతంగా సాగుతు న్న ఈ సమ యంలో యూరియాకు డిమాండ్ అధికంగా ఉండటంతో ప్రస్తుత పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానాన్ని తెలంగాణలో దశలవారీగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు పారదర్శకంగా, సమానంగా ఎరువులు అందించేందుకు సాంకేతికత ఆధారిత విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ, రిటైల్ స్థాయిలో తగినంత యూరి యా అందుబాటులో ఉండటం అత్యంత కీలకమన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ తరచూ షట్‌డౌన్ కావడం వల్ల రాష్ట్రానికి యూరియా సరఫరా, ముందస్తు నిల్వల ఏర్పాటు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుత షట్‌డౌన్‌ను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించి, వీలైనంత త్వరగా ప్లాంట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. ప్రస్తుతం అంచనా వేసిన 10 రోజుల వ్యవధి కంటే ముందుగానే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కారణంగా తెలంగాణకు అందే యూరియాలో ఏర్పడే లోటును ఇతర దేశీయ ఎరువుల కర్మాగారాల నుంచి, అలాగే దిగుమతి చేసుకునే యూరియా ద్వారా అదనపు కేటాయింపులు చేయడం ద్వారా భర్తీ చేయాలని మంత్రి కోరారు. రాష్ట్రంలోని రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ విధానం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందేలా ముందుగానే తగినంత నిల్వ లు ఏర్పాటు చేయాలని సూచించారు.

భవిష్యత్‌లో కీలక వ్యవ సాయ సీజన్లలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుం డా ఆర్ఎఫ్‌సీఎ ల్‌లో ముందస్తు నిర్వహణ, ప్రివెంటివ్ మె యింటెనెన్స్, కాంటింజెన్సీ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. తెలంగాణ రైతులకు ఖరీఫ్ సీజన్‌లో నిరంతరాయంగా యూరియా అందేలా కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# మేజర్ సర్జరీలచు ఆసుపత్రులను సిద్ధం చేయండి

- **వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**
మేజర్ సర్జరీలు కూడా చేయగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా కమ్యునిటీ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, డిస్ట్రిక్ట్ హాస్పిటళ్లు అభివృద్ధి చెందాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా స్థానికంగానే ప్రజలకు వైద్య సేవలకు అందించే అవకాశం జిల్లా, ఏరియా హాస్పిటళ్లకు ఉందని మంత్రి పేర్కొన్నారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తే.. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేశామని మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లు, సిబ్బందితో పాటుగా అవసరమైన అన్ని సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, పరికరాలు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.చిన్న చిన్న సమస్యలకు కూడా పేషెంట్లను పెద్ద హాస్పిటళ్లకు రిఫర్ చేసి ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి మారాలని మంత్రి అన్నారు. ఇప్పటికే చాలా హాస్పిటళ్లలో ఆ మార్పు వచ్చిందని, ఇంకా కొన్ని హాస్పిటళ్లలో అదే పరిస్థితి ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సరైన కారణం ఉంటే తప్ప పేషెంట్లను రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మరో హాస్పిటల్‌కు రిఫర్ చేయాల్సి వస్తే, ముందుగానే ఆ హాస్పిటల్‌కు సమాచారం అందించి, అక్కడి వైద్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా అందించగల వైద్య సేవలను అందించకుండా పేషెంట్లను పైస్థాయి హాస్పిటళ్లకు పంపడం వల్ల పేషెంట్లపై అదనపు భారం పడటంతో పాటు, టెర్షియరీ హాస్పిటళ్లపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, బెడ్లు, పరికరాలు, డయాగ్నస్టిక్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా డీసీహెచ్ఎస్‌లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అవసరమున్న చోట కొత్త సీటీ స్కాన్లు ప్రభుత్వ హాస్పిటళ్లలో అవసరమైన వైద్య, డయాగ్నస్టిక్ పరికరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అన్నారు. అవసరం ఉన్న హాస్పిటళ్లలో కొత్త సీటీ స్కాన్లు, ఇతర డయాగ్నస్టిక్, వైద్య పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీసీహెచ్ఎస్‌లను మంత్రి ఆదేశించారు. అయితే పరికరాల కోసం ప్రతిపాదనలు పంపేటప్పుడు కేవలం డిమాండ్ చేయకుండా, రోగుల సంఖ్య, అవసరం, ప్రస్తుతం అందిస్తున్న సేవలు, వినియోగ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా స్పష్టమైన జస్టిఫికేషన్ ఇవ్వాలని సూచించారు.వారానికి కనీసం ఒకరోజు హాస్పిట ళ్లలో ఆకస్మిక తనిఖీలు డీసీహెచ్ఎస్‌లు కేవలం కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు పరిశీలిస్తే సరిపోదని మంత్రి స్పష్టం చేశారు. తమ పరిధిలోని ప్రతి హాస్పిటల్‌ను వారానికి కనీసం ఒకరోజు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా? పేషెంట్లకు సకాలంలో వైద్యం అందుతోందా? పరికరాలు పనిచేస్తున్నాయా? టెస్టులు, స్కాన్లు అందుబాటులో ఉన్నాయా? మందుల పరిస్థితి ఏమిటి? పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సక్రమంగా జరుగుతున్నాయా? వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. డీసీహెచ్ఎస్ ప్రతి నెలా తమ వర్క్ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి అందించాలని మంత్రి ఆదేశించారు.విధులకు గైర్హాజరు, ముందే వెళ్లిపోతే చర్యలు హాస్పిటళ్లలో విధులకు గైర్హాజరవడం, నిర్ణీత సమయం కంటే ముందే హాస్పిటల్ నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్లకు అందాల్సిన సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి లోటు రాకూడదని, సమయపాలన, బాధ్యత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.హాస్పిటళ్లలో సమస్యలు పెద్దవిగా మారే వరకు వేచి చూడకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని మంత్రి అన్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సమస్యలు, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర శాఖల సమన్వయం అవసరమైన అంశాలపై సంబం ధిత అధికారులతో సమన్వయం చేసుకుని సకాలం లో చర్యలు తీసుకోవాలని సూచించారు.



# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు ఎందుకు? బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలి..
- తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ము బీజేపీ నేతలకు లేదా?
- తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విఫలం
- రాజకీయాలు కాదు.. తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం కేంద్రం సహకరించాలి
- తెలంగాణ రైజింగ్‌కు కేంద్ర సహకారం అవసరం.. అడ్డంకులు సృష్టించడం సరికాదు
- రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం..
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రధానమంత్రి చెబుతున్న వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలి. అందులో తెలంగాణ కూడా కీలక భాగస్వామిగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకు వెళ్తోంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, దేశ అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడం, వివిధ అంతర్జాతీయ సదస్సుల్లో తెలంగాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం, అన్ని వర్గాలను కలుపుకుని సమగ్ర అభివృద్ధి సాధించడం మా లక్ష్యం.అయితే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి గారు అమెరికా, లండన్ విదేశీ పర్యటనలు చేపట్టాలనుకున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం బాధాకరం.

- రాష్ట్ర ప్రయోజనాల కోసం పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్లే హక్కు కూడా లేదా..?
- తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు, మౌలిక వసతుల విషయంలో కేంద్రం సహకరించాలి.
- మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్డు, ఇంటర్నల్ రేడియల్ రింగ్ రోడ్లు వంటి కీలక ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ఇతర ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలి.
- తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కూడా కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలి.
- చిన్నచిన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే విధానం కాకుండా, రాష్ట్రాల అభివృద్ధికి సహకరించే సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాలి.
- తెలంగాణ బీజేపీ నాయకత్వానికి ప్రశ్న
- తెలంగాణ బీజేపీ నాయకులు ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు..?
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో మీరు ఏ విధంగా వ్యవహరించారో ప్రజలకు తెలుసు.
- ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం ఎందుకు గళమెత్తడం లేదు..?
- బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో ఐక్యత కోసం కేంద్ర నాయకత్వం ప్రయత్నిస్తోందని వార్తలు వస్తున్నాయి.
- కానీ తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రాన్ని నిలదీయడంలో మాత్రం ఆ ఐక్యత కనిపించడం లేదు.
- తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు.
- మేము రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం.
- రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.
- కానీ కేంద్రం సహాయ నిరాకరణ చేస్తే తెలంగాణ ప్రయోజనాల కోసం మేము తప్పకుండా ప్రశ్నిస్తాం.
- తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలి. చిన్న రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో ముందుండాలి.
- ప్రతి వర్గానికి సమగ్ర అభివృద్ధి అందాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.
- కేంద్ర ప్రభుత్వం కూడా రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.
- అదేవిధంగా తెలంగాణ బీజేపీ నాయకత్వాన్ని కూడా కోరుతున్నాం మీరు ఐక్యంగా ఉన్నా, లేకపోయినా మీ ఇష్టం.
- కానీ తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో ముందుండండి. తెలంగాణ ప్రజల కోసం కేంద్రాన్ని ప్రశ్నించండి.
- పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణ కు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు..
- దక్షిణ భారదేశాల నుండి మేము ఇస్తున్నది ఎంత..? మీరు తిరిగి ఇస్తున్నది ఎంత..? ఒకసారి గమనించుకోవాలి..
- తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పని చేసినప్పుడే తెలంగాణ రైజింగ్ వికసిత్ భారత్ లక్ష్యాలు సాకారం అవుతాయి.



- పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజాపాలన
- తెలంగాణ ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయి? ఇంకా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలి? అనే ఉద్దేశంతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని 183 గ్రామాల్లో "పల్లె పల్లెకు ప్రజాపాలన – పల్లె పల్లెకు పొన్నం" కార్యక్రమాన్ని చేపట్టాం.
- ఈ నెల 19 వ తేదీ నుంచి ప్రతి రోజు ఒక మండలంలో 5 నుంచి 6 గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో నేరుగా సమావేశమవుతున్నాం.
- ఇది నాలుగో మండలంలో కొనసాగుతున్న కార్యక్రమం.
- ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను ఓపికగా వింటున్నాం.
- ముఖ్యంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలు, ఆయిల్‌పామ్ సాగు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు, రైతులకు అవసరమైన సూచనలు, ఆరోగ్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాలు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
- ప్రజల సమస్యలను కేవలం వినడంతో ఆపకుండా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.
- మండలస్థాయి అధికారులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేయడం వల్ల విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి చిన్నచిన్న సమస్యలు కూడా వెంటనే పరిష్కారమవుతున్నాయి.
- ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరం తగ్గించడమే ప్రజాపాలన లక్ష్యం.
- ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించినా, నేరుగా చెప్పినా వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించే బాధ్యత తీసుకుంటున్నాను.
- భవిష్యత్తులో జరిగే ప్రతి కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాను.
- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుంది.
- ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందాలి. ఇదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం.

# రాజకీయ కక్షతోనే సీఎం అమెరికా పర్యటనను రద్దు

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**
తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధితో ముడిపడిన అంశాలపై రాజకీయాలు చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి జ్ఞాన, నైపుణ్య, విద్యా, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయనే భావన కలగడం బాధాకరమన్నారు.సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేయడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన అమెరికా పర్యటన వ్యక్తిగత పర్యటన కాదని, తెలంగాణకు విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన అధికారిక పర్యటన అని స్పష్టం చేశారు."ప్రపంచ ప్రఖ్యాత విద్యా, నైపుణ్య, పరిశోధనా సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను పెంచడం, తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. అలాంటి లక్ష్యంతో చేపట్టిన పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించారనే భావన ప్రజల్లో కలగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు" అని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, యువత భవిష్యత్తు కంటే రాజకీయ విభేదాలకే ప్రాధాన్యం ఇవ్వడం కేంద్రం పునరాలోచించాల్సిన విషయమని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం–రాష్ట్రాల మధ్య రాజకీయ భేదాలు ఉండవచ్చని, అయితే రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకార ధోరణితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. "రాజకీయ కక్షలు ఉంటే రాజకీయ వేదికపై ఎదుర్కోవాలి. యువత భవిష్యత్తును, తెలంగాణ అభివృద్ధిని రాజకీయాలకు



బలిచేయకూడదు" అని మంత్రి అడ్లురి స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు ఇప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. ఈ విద్యా విధానాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు, సాంకేతిక సంస్థలను హైదరాబాద్ కు ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. "హైదరాబాద్ లో ఉన్న విద్యా, మానవ వనరుల సామర్థ్యాన్ని ప్రపంచంతో అను సంధానం చేయాలి. ప్రపం చస్థాయి సంసలు నగరానికి వస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధకులకు కొత్త అవకాశాలు, యువతకు అధిక నైపుణ్యాలు, ఉద్యోగార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని మంత్రి అడ్లురి అన్నారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, కృత్రిమ మేధ, సాంకేతికత, ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై చర్చలు జరగా ల్సి ఉందని మంత్రి తెలిపారు. తెలంగాణలోని విద్యార్థులు, యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు

# లవ్ జిహాద్ కేసులో పోలీసులు సమగ్ర విచారణ జరపాలి

కాకినాడ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి నూకరాజు గారి కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవటానికి కారకుడైనటువంటి కాకినాడ రైఫూల్ శిక్షకుడు షేక్ సాదిక్ ఖాన్ ని పోలీసులు ఢిల్లీలో అదుపులో తీసుకున్నట్టు వస్తున్న వార్తలు ఆనందదాయకం అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు.ప్రశాంతమైన కాకినాడ నగరంలో ఇటువంటి దారుణానికి సాదిక్ ఖాన్ ఎందుకు వరిగెట్టాడు కారణాలు ఏంటి ఇస్లాం మతంలోకి మారమని సౌజన్యను ఎందుకు బలవంతం చేశాడు పోలీసులు తేల్చాలని రవి కిరణ్ అన్నారు. అలాగే సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మరణానికి కారణం సాదిక్ ఖాన్ అని ఆమె మామగారు భాస్కర్ రెడ్డి గారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసు శాఖ పూర్తిస్థాయి విచారణ జరపాలి అని రవి కిరణ్ డిమాండ్ చేశారు.సాదిక్ ఖాన్ బాధితుల జాబితాలో సౌజన్య కాకుండా ఇంకెవరైనా ఉన్నారా ఇలాగే ఎంతమందిని వేధించాడు బెదిరించాడు మతం మారమని బలవంతం చేశాడో అన్న కోణంలో కూడా విచారణ జరపాలని అన్నారు.అలాగే గతంలో ఒక కార్పొరేట్ స్కూల్లో శిక్షకుడిగా ఉంటూ విద్యార్థినిలను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో పాత కేసులు కూడా తిరగతోడి సమగ్ర విచారణ చేయాలని రవికిరణ్ డిమాండ్ చేశారు.




# ఘనంగా రాజా బహదూర్ రామిరెడ్డి జయంతి వేడుకలు

- హాజరైన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
రాజా బహదూర్ రామిరెడ్డి 157వ జయంతి సందర్భంగా నారాయణగూడలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలలో జరిగిన జయంతి వేడుకలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని రాజబహదూర్ రామిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినీల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, "నిజాం పరిపాలన కాలంలో తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయులు రాజబహదూర్ రామిరెడ్డి అని ఆయన తెలిపారు. ఆనాడు ఆయన దూరదృష్టితో హాస్టల్స్ , విద్య సంస్థలు స్థాపించారని , ఆ సంస్థలు నేటి యువతరానికి నాణ్యమైన విద్యను అందిస్తూ, మంచి పౌరులుగా జీవిస్తున్నారని ఆయన చెప్పారు. నేటి యువత చేదు వ్యసనాలకు ఆసక్తి చూపుతుందని, అలాంటి అలవాట్ల వల్ల భవిష్యత్ ను నాశనం చేసుకొంటున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ఎక్కువ నిధులను కేటాయిస్తూ , విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. విద్యార్థులు బాగుపడలి అంటే తల్లిదండ్రులు ఆలోచన విధానం మారాలి, విద్యార్థులకు ఏ రంగంపైన ఆసక్తి ఉంటే అటు వైపు వాళ్ళని వెళ్ళనివ్వాలి. విద్యార్థులకు ఫిజికల్ ఆక్టివిటీ చేయించాలి, కానీ నేడు ఆ





పరిస్థితి స్కూళ్లలో కనిపించడం లేదు. పిల్లలు నేరపురిత అలవాట్లకు బానిసలు అవుతున్నారు. మంచి మాట చెబితే మొన్న కొండ మల్లెపల్లిలో ప్రిన్సిపాల్ రూప రెడ్డి ని , ఆ పాఠశాల విద్యార్థులు కిరతకంగా మర్డర్ చేసారు. చాలా బాధాకరమైన సంఘటన. జల్సాలకు , విలాసాలకు , మత్తు పదార్థాలు విద్యార్థులు దూరంగా ఉండాలి అని సూచించారు.

# అన్ని వయస్సుల వారికి ఫిజికల్ లిటరసీని అందించడమే లక్ష్యం

- యువతతో పాటు చిన్నారులు, వృద్ధులు కూడా శారీరక చైతన్యాన్ని పెంపొందించుకోవాలి.

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 22:**

తెలంగాణలో అన్ని వయస్సుల ప్రజలకు 100 శాతం ఫిజికల్ లిటరసీ అందించడమే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU) లక్ష్యమని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. కిషోర్ గోపీనాథన్ తెలిపారు.జిల్లా స్థాయిలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమం అమలుపై యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ సహకారంతో శనివారం రాష్ట్ర స్థాయి వర్చువల్ ఓరియంటేషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డా. కిషోర్ గోపీనాథన్ మాట్లాడుతూ ఫిజికల్ లిటరసీ అనేది కేవలం యువత క్రీడల్లో పాల్గొనేందుకు మాత్రమే ఉద్దేశించినది కాదని, చిన్నారులు, యువత, వృద్ధులు సహా అన్ని వయస్సుల వారు శారీరక చైతన్యాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునేలా చేయడమే యూనివర్సిటీ లక్ష్యమని తెలిపారు.ఆధునిక క్రీడలతో పాటు గ్రామస్థాయిలో సాంప్రదాయ క్రీడలను కూడా ప్రోత్సహించి, ప్రజల్లో శారీరక చైతన్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఫిజికల్ లిటరసీని అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతం చేసేందుకు ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్‌తో యూనివర్సిటీ భాగస్వామ్యం చేసుకుందని తెలిపారు.ప్రతి జిల్లాలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారులు సమన్వయంతో అన్ని వయస్సుల ప్రజలకు ఫిజికల్ లిటరసీని చేరువ చేసేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని వైస్ ఛాన్సలర్ సూచించారు. జిల్లా స్థాయి ఫిజికల్ లిటరసీ కోఆర్డినేటర్లు కీలక




పాత్ర పోషిస్తూ జిల్లా కలెక్టర్, సామాజిక ప్రభావశీలులు, వివిధ ప్రచార కార్యక్రమాలతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైన డేటాబేస్‌ను రూపొందించుకుని వనరుల వ్యక్తులుగా వ్యవహరించాలని తెలిపారు. ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ గవర్నెన్స్ & హెచ్‌ఆర్ ప్రతినిధి అమిత్ మాలిక్ మాట్లాడుతూ ఇప్పటివరకు 50 దేశాల్లో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఫిజికల్ లిటరసీ అనేది శరీరం, మనస్సు, హృదయం సమన్వయంతో కూడిన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ మూడు అంశాలే ప్రతి వ్యక్తి ఫిజికల్ లిటరసీ ప్రయాణానికి పునాదులని వివరించారు. ఫిజికల్ లిటరసీ అనేది కేవలం యువతకు సంబంధించిన క్రీడా కార్యకలాపం కాదని, అన్ని వయస్సుల వారు ప్రతిరోజూ చురుకుగా ఉండి తమ శారీరక దృఢత్వాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన జీవన విధానమని అమిత్ మాలిక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, శ్రీమతి ఎస్. స్వర్ణలత, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీమతి జి. శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు శిక్షణ కార్యక్రమం

- రసాయానిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలి
- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ కృష్ణ
- వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన విధంగా రైతులు పద్ధతులు పాటించాలి
- సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మానిపాటి శోభ కుమార్

**మంచాల వెలుతురు ఆగస్టు 22:**

మంచాల మండలం ఆరుట్ల గ్రా మంలోని రైతు వేదికలోవ్యవసా య సాంకేతిక యాజమా న్య సంస్థ (ఆత్మ) మరియు వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో ఆరుట్లరైతు వేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమా న్ని నిర్వహించారుఈ కార్యక్ర మా నికి ముఖ్యఅతిథిగాపాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ కృష్ణమంచాల సహకార సంఘం చైర్మ న్ వెదిరె హన్మంత్ రెడ్డి ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కు మార్ ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీ కృష్ణ మాట్లాడుతూ రైతు తనకున్న పొ లంలో కొద్ది విస్తీర్ణంలోనైనా సేంద్రీయ వ్యవసాయం చేయాలని కో రారు సేంద్రీయ వ్యవసాయం దీర్ఘకాలం పాటు చేస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తెలి పారు సేంద్రీయ వ్యవసాయం లో చీడపీ డల నివారణకు అగ్ని అస్రము బ్రహ్మ అస్రము నీమాస్త్రంప విధంగా రైతు స్థాయిలో తయారు చేయాలో తెలిపారుమండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం వరిలో బిపిటి 5204 హెచ్ఎంటి సోనా జైశ్రీరామ్ కేఎన్ ఎమ్1638కేఎన్ఎమ్7715 డబ్ల్యూ జి ఎల్ 44 ఆర్ ఎన్ ఆర్ 15048 వంటి సన్న రకాలు సాగు చేసినటువంటి రైతులు వెంటనే వ్యవసా య విస్తరణ అధికారులను కలిసి నమోదు చేసుకో వాలని కోరారు పైన తెలిపిన ఏడు రకాలను సాగు చేసిన రైతులకే ప్రభుత్వ బోనస్ వస్తుందని తెలిపారువాతా వరణంలో అసమతు ల్యత వలన రానున్న కొద్ది రోజులలో వరి పం టలో అగ్గి తెగులు సుడిదోమఆ శించి అవకాశం ఎక్కు వగా ఉందని తెలిపారు రైతులు తమ వరి పొలాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎలాంటి తెగు ల లక్షణాలు క నిపించిన వెంటనే సమాచారం ఇ వ్వాలని కోరారు ఎల్ నినో వర్షా భావ పరిస్థి తుల దృశ్య రైతులు ప్రస్తుతం స్వల్పకాలిక ఆరుతడి పంటలను సాగు చేసుకో వాలని కోరారు సోమవారం నుండి గ్రామాలలో డిజిటల్ పంట సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు మంచా ల మండలంలో 24 మంది



వాలంటీర్లు సర్వేనెంబర్ టు సర్వేనెంబర్ తిరిగి రైతులు వేసినపంట ను నమోదు చేస్తారని తెలిపారు కావున వాలంటీర్లకు అందరూ సహక రించాలని కోరారు సంద ర్భంగా మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన చెప్పిన పద్ధతుల ప్రకారం రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరు వులని వాడాలి అని అన్నారు రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసు కోవాలి అధికారులు చెప్పిన సలహా ల ప్రకారం వ్యవసాయం సాగు చే యాలి అని అన్నారు ఈ కార్యక్రమంలోమండల వ్యవసాయ అధికారి వెంకటేష్.ఆరుట్ల సర్పంచ్ మానుపాటి శోభకుమా ర్ ఆగపల్లి సర్పంచ్ ఉమ ఆరుట్ల ఉపసర్పంచ్ నూకం రాజు వ్యవసాయ విస్తరణ అధికారులు లింగస్వామి సాయి సిరి నికిత మరియు గ్రామపంచాయతీ వార్డుసభ్యులు లాలాగరి మణెమ్మ మాదుగుల బాలమని కృష్ణ గౌడ్ వివిధ గ్రామల రైతులు పాల్గొన్నారు.

# ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 27న జరిగే మహాధర్నా ను విజయవంతం చేయాలి

- రంగారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కె రామారావు మరియు శ్రీనేష్ కుమార్ నోరి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 22:**

TGOs' అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు డాక్టర్ కె రామారావు మరియు శ్రీనేష్ కుమార్ నోరి నేతృత్వం లో కార్యవర్గ సమావేశం ఈరోజు కొంగరకలాన్ లోని IDOC లో పలు కీలక అంశాలను చర్చిం చి, క్రింది కార్యక్రమాలు ఏకగ్రీవంగా నిర్ణయించింది:

TGEJAC తీసుకున్న నిర్ణయాలు, PRC ని వెంటనే ప్రకటించాలి, DA లను వెంటనే ప్రకటించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి, OPS ను పునరుద్దరించాలి, EHS ను సమర్ధవంతం గా అమలు చేయాలని కోరుతూ తీసుకున్న నిర్ణయాలకు మద్దతు ప్రకటించి ఈ క్రింది కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ కోరారు.

- **27 ఆగస్టు 2026: ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా/ప్రదర్శన.**
- **1 సెప్టెంబర్ 2026: CPSకు వ్యతిరేకంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా.**
- **10 సెప్టెంబర్ 2026: చలో హైదరాబాద్ కార్యక్రమం.**

ఈ కార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లా నుండి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందిస్తూ, అధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీమతి డా. కిరణ్మయి, ఐఏఎస్ గారిని కలిసి, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఈనెల 27వ తారీకున మహా ధర్నా కార్యక్రమానికి



సంబంధించి సమాచార పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ నూతనకంటి వెంకట్, అసోసియేట్ ప్రెసిడెంట్, శ్రీ నర్సిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్, శ్రీమతి శాంతిశ్రీ, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ శ్రీ నాగేశ్వర్ రావు, శ్రీ రాకేష్, శ్రీమతి మహేశ్వరి, శ్రీమతి జ్యోత్స్న, డా. నరేందర్, శ్రీ శ్రీనివాస్, శ్రీ మహేష్, తదితరులు పాల్గొని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం మరియు వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం మనమందరం ఐక్యంగా, సమష్టిగా పనిచేద్దాం అని పేర్కొన్నారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 22:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ డివిజన్‌లోని సింహపురి కాలనీ డి బ్లాక్ లో పర్యటించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు. ఈ సందర్భంగా నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు, వీధి దీపాలు,డ్రైనేజీ సౌకర్యాలు, పార్కు అభివృద్ధి, పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుతో సహా అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని నివాసితులు కోరారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాలనీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లహరి గ్రీన్ పార్క్ కాలనీలో మొక్కను నాటారు, కాలనీలో పర్యటించారు. అక్కడ కూడా సరైన రోడ్లు, డ్రైనేజీ పైపులైన్, పార్క్ డెవలప్మెంట్, మంచినీటి మరియు ఇతర ప్రాథమిక మౌలిక



సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరారు. నివాసితులు తెలిపిన


సమస్యలను పరిశీలించి, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలకు సరైన మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించ డమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. నివాసితుల ఆందోళనలను వెంటనే పరిష్కరించాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బౌరంపేట ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, నాచారం మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, శంకర్ నాయక్, సీనియర్ నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి, సంజీవ్, బైండ్ల గోపాల్, కిరణ్, సాంభ శివారెడ్డి, ఏఈ సురేందర్ నాయక్, సింహపురి కాలనీ డి బ్లాక్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, లహరి గ్రీన్ పార్క్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ విష్ణు ,నాయకులు, కాలనీ సభ్యులు, పాల్గొన్నారు.

# పూజా చిత్రాల వ్యర్థాలతో జలవనరులు కలుషితం కాకుండా చర్యలు

- కూకట్‌పల్లిలో సిఎంసి ఆధ్వర్యంలో డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమం

**కూకట్ పల్లి ఆగస్టు 22 వెలుతురు:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయంలో సిఎంసి ఆధ్వర్యంలో డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలకు పనికిరాని దేవతామూర్తుల చిత్రాలు, ఇతర దైవ సంబంధిత వస్తువులను చెరువులు, కాలువలు, నీటి వనరుల్లో పడేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, మాజీ కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, మాధవరం రంగారావు, జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ పూజలకు పనికిరాని పాత, చిరిగిపోయిన దేవుని చిత్రాలను చెరువులు, కాలువల్లో వేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు దైవ సంబంధిత వ్యర్థాలను గౌరవప్రదంగా సేకరించి తొలగించేందుకు డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడుతూ ప్రతి నెల ఒక శనివారం రోజున ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి పాత, విచ్ఛిన్నమైన దేవుని చిత్రాలు, పూజా సంబంధిత వ్యర్థాలను సేకరించనున్నట్లు తెలిపారు. సేకరించిన వాటిని సాంప్రదాయబద్ధంగా గౌరవప్రదంగా తొలగించి, సాధ్యమైన మేరకు రీసైక్లింగ్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని పూజలకు పనికిరాని దేవతా చిత్రాలు, ఇతర దైవ సంబంధిత వ్యర్థాలను నీటి వనరుల్లో పడేయకుండా సిఎంసి చేపడుతున్న డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమానికి అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు జలవనరుల స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# అల్మాస్గూడలో ఘనంగా 'రాజ్ లక్ష్మి స్వీట్స్' ప్రారంభం

**అల్మాస్గూడ, వెలుతురు ఆగస్టు 22:**

అల్మాస్గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'రాజ్ లక్ష్మి స్వీట్స్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహేశ్వరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వీట్స్ షాప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అన్ని రకాల స్వీట్లు, డ్రై ఫ్రూట్స్, చాట్, జ్యూస్ తదితరాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్వచ్ఛమైన నెయ్యితో నాణ్యమైన స్వీట్లను తయారు చేసి, అందరికీ అందుబాటు ధరల్లో విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు.అల్మాస్గూడ పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన స్వీట్లు తక్కువ ధరల్లో అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 'రాజ్ లక్ష్మి స్వీట్స్'ను ఆదరించాలని కోరారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానికులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై



నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ఈ స్వీట్స్ షాప్‌తో అల్మాస్గూడ ప్రజలకు నాణ్యమైన స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# యారా జంగయ్య కుటుంబానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ సాయం

- ఆపదలో అండగా 20000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

**మంచాల వెలుతురు ఆగస్టు 22:**

మంచాల మండలం కాగజ్ ఘట్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యారా జంగయ్య (భద్రాచలం)ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు యారా జంగయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు అనంతరం బిఆర్ఆర్ ఫౌండేష న్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబానికి బిఆర్ఆర్ ఫౌండేషన్. సభ్యులు యార జంగయ్య కుంభానికి 20000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ జంగయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామనిపి ల్లలకు ఎడ్యుకేషన్ పరంగా బిఆర్ఆర్ ఫౌండేషన్ ముందుంటుందని అన్నారు వ్యక్తి గతంగాకార్య క్రమానికి హాజరు కాలేకపోయినప్పటికీ



తన టీమ్ సభ్యులను పంపించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం వారి మానవత్వానికి సేవాభావానికి నిదర్శనం ఆపదలో ఉన్న కుటుంబా నికి అండగా నిలవడంమే నిజమైన మానవత్వం అని అన్నారు ఈ కార్యక్రమంలోబి అర్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు పున్నం రాము బకున చందు మడుపు గోపాల్ అశ్వాల బాలరాజు ఎండి షాకీర్ మహేష్ కాగజ్ గట్ గ్రామ వార్డ్ సభ్యులు సయ్యద్ ఇర్ఫాన్ సయ్యద్ రిజ్వాన్ నవాజ్ అంజి రెడ్డి పూజారి రవి యాట రాజు చక్రపాణి వంగల శ్రీకాంత్ వంశీ భాను ఇర్ఫాన్ పూజారి నవీన్ ఇర్ఫాన్ బిఆర్ఆర్ బిఆర్ ఎస్ సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొ న్నారు

# పేదరిక నిర్మూలనే లక్ష్యం

- ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్
- ఐకెపి భవనంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ 18వ సర్వసభ్య సమావేశం
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన సభ్యులకు సన్మానాలు, అవార్డులు
- నూతన సంఘాలకు రుణాల మంజూరు

**శంకరపల్లి, వెలుతురు ఆగస్టు 22 :**

మండల పరిధిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ 18వ సర్వసభ్య సమావేశాన్ని శంకరపల్లి మండల కేంద్రంలోని ఐకెపి భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంకరపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక అభ్యున్నతి, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంస్థ పనిచే




స్తోందని తెలిపారు. సమావేశంలో భాగంగా సంఘం యొక్క అజెండా రిపోర్టును ఆయన చదివి వినిపించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘంలో అత్యుత్తమ ప్రతిభ (బెస్ట్ పెర్ఫార్మన్స్) కనబరిచిన మహిళా సభ్యులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి, అవార్డులను అందజేశారు. అనంతరం ఐకెపి ద్వారా నూతనంగా ఏర్పాటైన పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు, కార్యదర్శి, మండల ఏపీఎం రవీందర్, సీసీలు (కమ్యూనిటీ కోఆర్డినేటర్లు) పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు

# మీర్పేట్‌లో ఘనంగా 'చాయ్ బంక్ కేఫ్' ప్రారంభం

మీర్పేట్ వెలుతురు ఆగస్టు 22:

నందిల్స్ రోడ్ నంబర్ 13లో నూతనంగా ఏర్పాటు చేసిన 'చాయ్ బంక్ కేఫ్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై కేఫ్‌ను ప్రారంభించారు.కార్యక్రమంలో నిర్వాహకులు పాలాది తరుణ్, ప్రకాష్ పాటు బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. చాయ్ ప్రియులకు నాణ్యమైన టీ, స్నాక్స్‌తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో చాయ్ బంక్ కేఫ్ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీనిలో కాలనీవాసులు మరియు బంధుమిత్రులలో అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



# ఉద్యమ కెరీటం సురవరం సుధాకర్ రెడ్డి కి ఘనంగా జోహార్లు అర్పించారు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 22:**
ప్రజా ఉద్యమాల కోసం జీవితమంతా పోరాడిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలో సుభాష్ సెంటర్లో సిపిఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ ఉమ్మడి మహబబ్ నగర్ జిల్లాలో జన్మించి సురవరం సుధాకర్ రెడ్డి నల్లగొండ జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉంది. అని అన్నారు. నల్లగొండ గడ్డపై వామపక్ష ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. నల్లగొండ లోక్సభ స్థానం నుండి పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికై ప్రజలకు విశిష్ట సేవలు అందించారు. అని పేర్కొన్నారు. ముఖ్యంగా సాగు నీరు ప్రాజెక్టులను ఎస్ ఎల్ బి సి శ్రీశైలం ఎడమ గట్టు కాలువ డిండి ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు రైతులకు ప్రజల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటం కొనసాగించాదని కొని ఆడాడు,సిపిఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల పక్షాన నిలిచిన ఉద్యమ నాయకుడు అని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే నిజమైన నివాళులు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రచ్చయాదగిరి



ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య సీనియర్ కామ్రేడ్స్ బాలగోని మల్లయ్య ఊట్కూరి భగవంతం, వీరమల్ల వెంకటయ్య, గంగాపురం యాదయ్య, గంగాపురం వెంకటయ్య, పర్స సుదర్శన్, కళ్లం యాదయ్య,ఊట్కూరి కృష్ణ, వీసం గాలయ, పల్లె మల్లేశం, సిహెచ్ మల్లేశం, రచ్చ దయాకర్, గంజి అశోక్ పాల్గొన్నారు.

# సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి

**మోత్కూరు, ఆగస్టు 22, వెలుతురు :**
కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు మరవలేనివని, సీపీఐ మోత్కూరు మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక కేఆర్ భవన్‌లో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నెపు వెంకట్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి రెండుసార్లు నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారని, మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యపై పార్లమెంట్‌లో గళమెత్తారని గుర్తుచేశారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడుతూ అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పులకరపు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ల శేఖర్‌రెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పెండెం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగ నర్సయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి తాడూరు లక్ష్మీనర్సయ్య, గొలుసుల యాదగిరి,



ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి బోడ సోమనర్సయ్య, టైలర్ సంఘం పట్టణ అధ్యక్షుడు నిలిగొండ అశోక్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చిప్పలపల్లి ప్రశాంత్, నాయకులు కడమంచి భాషా సాయి, కడమంచి వీరస్వామి, మల్లెబోయిన బుచ్చయ్య, అయిలయ్య, రాజు, గంగాదేవి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ డిప్యూటీ కమిషనర్ జోగుల్ నరసయ్య కు సన్మానం

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 22:**
మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మాజీ తొలి సర్పంచ్ జోగుల రామలింగయ్య కనిష్ట పుత్రుడు జోగుల నరసయ్య అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సికింద్రాబాద్ కి ఉత్తమ పోలీసు అవార్డు రాష్ట్రపతి చైతన్య తీసుకున్న సందర్భంగా గ్రామంలోని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేయ నైనది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నతనం నుంచి కష్టపడి మారుమూల ప్రాంతమైన మా గ్రామం నుండి ఉన్నత స్థాయి అధికారిగా సేవలందిస్తూ రాష్ట్రపతి అవార్డు తీసుకురావడం మా గ్రామానికి గర్వకారణం అని అన్నారు. ఆయన కేవలం పోలీసు అధికారిగా కాకుండా గ్రామ అభివృద్ధిలో అనేకసార్లు తన సేవలను అందించారని భవిష్యత్తులో కూడా గ్రామ



అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు.

# ఇంద్రపాలనగరం గ్రామంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 22:**
గ్రామం ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సధస్సు లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శిరీషా పాల్గొన్నారు. విద్యార్థులకు చైల్డ్ లేబర్ యాక్ట్, రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్,చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్,ట్రాఫిక్ రూల్స్, ఫోక్సో, డ్రగ్స్ కన్సప్షన్ వంటి చట్టాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ చట్టాలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో కోర్ట్ సిబ్బంది మన్నన్ ఖాన్, పాపయ్య, సునీల్, ప్రాధనోపాధ్యాయురాలు నిర్మల, కే. లింగచారి, పీడీ మని ఉపాధ్యాయులు ఏఏపిసి చైర్మన్ కొమ్మగోని మమత, విద్యార్థుల



తల్లితండ్రులు, నాగు నిరోషా, పగుడాల నరేందర్, వెలిమినేటి నరేష్, భువగిరి మధు, మేకల నరేందర్, గర్ధాస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా ర్యాలీ

**మోత్కూర్, ఆగష్టు 22,వెలుతురు:**
నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి కి చెందిన ఒక ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను నిరసిస్తూ మోత్కూరు లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు నిరసనగా కొత్త బస్ స్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ రూపారెడ్డి తన పాఠాశాలలో చదువుతున్న విద్యార్థులను మందలించినందుకు కక్ష పెంచుకొని విద్యార్థులు రూపారెడ్డి ని హత్య చేశారు.నేటి సామాజంలో విద్యాబుద్ధులు చెప్పినందుకు గురుదక్షిణగ కత్తి పోట్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జహీరాబాద్‌లో ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 22:**
శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో వరలక్ష్మి వ్రతం పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన దేవగిరి రూపాలి ప్రకాష్ నివాసంలో ప్రత్యేకంగా అలంకరించిన వరలక్ష్మి అమ్మవారికి మహిళలు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్తైదువులను ప్రత్యేకంగా ఆహ్వానించి పసుపు, కుంకుమలు అందజేశారు. అనంతరం ముత్తైదువులకు బహుమతులు అందించి సన్మానించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించడం ద్వారా కుటుంబంలో సుఖ సంతోషాలు, ఐశ్వర్యం, సౌభాగ్యం



కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని, వ్రతాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో సాక్షి, ఖుషి, లక్ష్మీ, అనిత, రేష్మ, శ్వేతా, దీపిక, ప్రీతి, స్వాతి పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంటి వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# బీజేపీ ఎస్.టి. మోర్చా జిల్లా కోశాధికారిగా బెల్లంకొండ ఆంజనేయులు

**మోత్కూర్, ఆగస్ట్ 22 (వెలుతురు):**
భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా సూర్యాపేట జిల్లా కోశాధికారిగా బెల్లం కొండ ఆంజనేయులు నియమించిట్లు సూర్యాపేట జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు మాలో తు సక్రు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బెల్లం కొండఆంజనేయులు



మాట్లాడుతూ ఎస్టి సంక్షే మానికి నా శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. నియామకానికి సహకరించిన పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల కు, జిల్లా నాయకులకు అందరికీ ధన్యవాదాలు తెలుపారు.

# అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

**నూతనకల్(వెలుతురు)ఆగస్ట్22**
అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు నూతంకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నూతంకల్ ఎస్ఐ తెలిపారు.రామన్నగూడెం గ్రామం, ఆత్మకూర్ (ఎస్) మండలానికి చెందిన చలమల వీరస్వామి, తండ్రి యల్లయ్య, అతని కుమారుడు చలమల లెనిన్, మరియు మిర్యాల గ్రామానికి చెందిన పీడీఎస్ బియ్యం డీలర్ కృష్ణారెడ్డి వద్ద నుండి సుమారు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కిలోకు రూ.15/- చొప్పున కొనుగోలు చేశారు.అనంతరం ఆ బియ్యాన్ని అశోక్ లేలాండ్ మినీ గూడ్స్ వాహనం నంబర్ TS-07-UJ-0634లో లోడ్ చేసుకుని మామిళ్లమడవ గ్రామ శివారులోని కోళ్లఫారానికి తరలిస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు నూతనకల్ పోలీసులు మిర్యాల గ్రామ



శివారులో వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నారు.వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు నూతనకల్ ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బీసీ బహుజన నాయకుడు కైరం కొండ వినోద్ కుమార్ నియామకం

**యాదగిరిగుట్ట, వెలుతురు ఆగస్టు 22:**
యాదాద్రి-భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా యాదగిరిగుట్ట మాజీ ఎంపీటీసీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడు, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కలిగిన బహుజన నాయకుడు శ్రీ కైరం కొండ వినోద్ కుమార్ గారు నియమితులయ్యారు.బీసీ సామాజిక వర్గానికి చెందినప్పటికీ, గతంలో ఎంపీటీసీగా తన పదవీ కాలంలో కులాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి, ముఖ్యంగా దళిత, గిరిజన, బీసీ, బహుజనుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడిన వ్యక్తిగా వినోద్ కుమార్ గారికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది.విద్యావంతుడిగా, అన్ని వర్గాల పట్ల సామాజిక సేవా దృక్పథంతో నిబద్ధతతో పనిచేసే బీసీ నాయకుడికి ఈ పదవి దక్కడం



జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎంతో భరోసానిచ్చే అంశం. బీసీ – ఎస్సీ – ఎస్టీ బహుజన ఐక్యతకు ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, దళిత, బహుజన, బీసీ సంఘాల నాయకులు, మేధావులు, యువకులు బీసీ బిడ్డ వినోద్ కుమార్ అన్న హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.



# భూ వివాదం.. అధికారుల సర్వే

**మునుగోడు,ఆగస్ట్ 22 (వెలుతురు):**
మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన మంగదొడ్ల గూడెంలో కోడి రాములుకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా భూమిపై వివాదం నెలకొంది.సర్వే నంబర్ 623లో ఉత్తర్వు నంబర్ 5927/96 ప్రకారం రాములుకు రెండు ఎకరాల లావుణి పట్టా మంజూరైంది. కొంత కాలం సాగు చేసిన ఆయన ఆర్థిక ఇబ్బందులతో ముంబైకి వలస వెళ్లారు. ఈ సమయంలో ఎకరం భూమిని పట్టేదారు లేని సమయంలో హద్దురాళ్లు నాటించారని ఆరోపిస్తు రాములు జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో శనివారం తహసీల్దార్ నరేష్,ఆర్ఐ వంశీ, సర్వేయర్ భూమిని సర్వే చేశారు. పట్టాదారు భూమి విస్తీర్ణం కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అని స్థానికులను అధికారులు ప్రశ్నించగా, తమ వద్ద ఏవీ లేవని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

# మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 22:**
మౌళిక వసతుల కల్పనలో భాగంగా శనివారం 125 – గాజుల రామారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు 4.32 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టనున్న బీటీ రోడ్డు, సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత 12 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల అభివృద్ధి లక్ష్యంగా కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అన్ని కాలనీలను అభివృద్ధి పరచామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రానున్న రోజుల్లో గాజులరామారం డివిజన్ తో పాటు కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తానన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా... ఉషోదయ కాలనీ ఫేస్ – 2:

- **1.66 కోట్ల రూపాయలు - బీటీ రోడ్డు పనులు.**
- **ప్రాగా టూల్స్ :40 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**
- **సాయి గ్రామం :22 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**
- **కట్టమైసమ్మ బస్తీ :34 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**
- **బతుకమ్మ బండ :80 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**
- **శివపురం కాలనీ :30 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**
- **యండమూరి లే ఔట్ :60 లక్షలు - సీసీ రోడ్డు పనులు.**

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్



నాయకులు కస్తూరి బాలరాజ్, నవాబ్ భాయ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు పీరారెడ్డి, కుమారస్వామి, కోటేశ్వరరావు, రవీంద్ర, రామ్ రెడ్డి, టి. ప్రతాపరెడ్డి, గాంధీ, వీరభద్రం, సోమిరెడ్డి, వినోద్ కుమార్, చంద్రశేఖర్, వీరభద్రరావు, శ్రీనివాసరావు, రాజన్న, మధు, కాజా, తిమ్మయ్య, డి. లక్ష్మి , అంబదాస్, జితేంద్ర, మల్లారెడ్డి, శ్రీకాంత్, చెట్ల వెంకటేష్, మంజుల, లక్ష్మణ్ నాయక్, సిద్దయ్య స్వామి, చందన, బాలరాజ్, బండారి శ్రీధర్ ముదిరాజ్, బుర్ర ముఖేష్, భాస్కర్, సుమన్ రెడ్డి, శివానందం, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్–భానుప్రియల నిశ్చితార్థానికి బీసీ జేఏసీ నాయకులు

**వలిగొండ వెలుతురు ఆగస్టు 22:**
బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బండిగారి భరత్ భాను ప్రియల ఎంగేజ్ మెంట్ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని దేవి శ్రీ గార్డెన్ లో



జరిగిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనన్నతో పాటు లింగంగౌడ్ తాటికొండ విక్రమ్ వరికుప్పల మధు తదితరులు పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 22:**
సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జి. సబిత, సీనియర్ సివిల్ జడ్జి–కమ్–చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి శ్రీ డి. సత్యయ్య పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల సమయం, వ్యయం ఆదా కావడంతో పాటు కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రామన్నపేట సబ్–ఇన్‌స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వ



యంతో పనిచేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని సమావేశంలో సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, న్యాయ వాదులు మరియు కక్షిదారులు,సహకరించాలని మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట కోరింది.

# గోల్డ్, సిల్వర్ పెట్టుబడుల పేరుతో రూ.28.14 కోట్ల మోసం.. నలుగురు అరెస్ట్

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:** అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి గోల్డ్, సిల్వర్‌లో భారీగా పెట్టుబడులు పెట్టించిన హైదరాబాద్‌కు చెందిన నేకీ ట్రేడర్స్ సంస్థపై జహీరాబాద్ టౌన్ పోలీసులు రెండు చీటింగ్ కేసులు నమోదు చేశారు. ఈ కేసులో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. జహీరాబాద్ టౌన్‌కు చెందిన మిదిదొడ్డి ఇజ్రాయేలు అలియాస్ బాబీ, కొత్త శశిధర్ రెడ్డి, నాగరిగారి విల్లీ ఫ్రాన్సిస్, పోతురాజు అరవింద్‌తో పాటు మరో 22 మంది గత రెండేళ్లుగా నేకీ ట్రేడర్స్‌లో సుమారు రూ.28,14,57,128 పెట్టుబడులు పెట్టారు. తొలుత కొంతకాలం పెట్టుబడులపై వడ్డీ చెల్లిస్తూ సంస్థ నిర్వాహకులు బాధితుల్లో నమ్మకం కల్పించినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం నమ్మకం పెరగడంతో బాధితులు వివిధ లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బును పెట్టుబడిగా అందించారు. అయితే ఆ తర్వాత పెట్టుబడులకు ఎలాంటి రాబడులు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. మిదిదొడ్డి ఇజ్రాయేలు అలియాస్ బాబీ, కొత్త శశిధర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా A-1 మల్లెం శేషువర్ధన రెడ్డి అలియాస్ శశువర్ధన్ రెడ్డి, A-2 బగ్గి రవీంద్ర బాబు అలియాస్ రవీందర్, A-3 దేవుల జగదీష్, A-4 పిండి సుష్మితలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.భారీ మొత్తంలో పెట్టుబడులకు సంబంధించిన ఈ వ్యవహారంపై జహీరాబాద్ టౌన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఆర్. రవి ఆధ్వర్యంలో ఎస్ఐ లవకు మార్, పోలీసు సిబ్బంది దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పెట్టుబడుల పేరుతో మోసపోయిన వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.




# 22-A భూముల బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి

- బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచర్ల డిమాండ్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 22:** తెలంగాణలో 22-A నిషేధిత భూముల జాబితాలో ప్రైవేట్, పట్టా భూములు చేరడంతో మధ్యతరగతి మరియు పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచర్ల ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుందామన్నా, భవిష్యత్తులో పిల్లల పెళ్లిళ్ల కోసం గుంట భూమి కొనుక్కున్నా రిజిస్ట్రేషన్లు కాక యజమానులు అరిగోస పడుతున్నారన్నారు.22-A నిబంధన ఉద్దేశం చట్టపరంగా బదలాయింపు నిషేధిత భూములను రక్షించడం కానీ, చట్టబద్ధమైన పట్టాదారుల హక్కులను దెబ్బతీయడం కాదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ వైఫల్యంపై ప్రధాన డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించి, 2023 డిసెంబర్ నుంచి జరిగిన మార్పులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలనీ, 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 22-A జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి సర్వే నంబర్ వివరాలను ప్రజల ముందుంచాలి. ఏ చట్టం, జీఓ లేదా కోర్టు ఉత్తర్వు ఆధారంగా వీటిని చేర్చారో స్పష్టం చేయాలని అన్నారు.. ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి ఉంటే రెండింటినీ వేరు చేసి నిజమైన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం కల్పించాలనీ, ప్రజలను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించాలన్నారు. అధికారుల తప్పిదాల వల్ల ఆర్థికంగా నష్టపోయిన భూయజమానులకు బాధ్యత ఎవరిదో ప్రభుత్వం చెప్పాలి. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి "ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, చట్టబద్ధమైన ప్రైవేట్ భూములపై ప్రజల హక్కులను కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని, 22-A పేరుతో నిజమైన పట్టాదారుడికి అన్యాయం జరగదని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఆచరణలో చూపించాలనీ డిమాండ్ చేశారు.ప్రజల భూముల విషయంలో రాజకీయాలుడా పారదర్శకత, బాధ్యత, కాలపరిమితితో కూడిన పరి ష్కారం చూపాలని రాజు అడిచర్ల డిమాండ్ చేశారు.



# ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి !

- అర్హులైన వారిని ఆదుకోవాలి
- టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి వినతి

**సంగారెడ్డి వెలుతురు ఆగస్టు 22:** ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని టియుడ బ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎకే పైసల్ కోరారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో శనివారం ఫోటోల ప్రదర్శనను నిర్వహించారు అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, డిపిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు వైద్యనాథ్, బిజెపి సీనియర్ నాయకుడు కొండాపురం జగన్, యువజన సంఘాల నాయకుడు కూన వేణు, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఇతర ముఖ్యులు సంతోష్, పవన్, రాజు, కృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ స్పాట్ ఫోటోల కోసం, ప్రజా సమస్యలను మరింత త్వరగా వెలుగులోకి తెచ్చేందుకు ఫోటో జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టులతో పాటు ఫోటో జర్నలిస్టులు కలిసి పనిచేయడం వల్లనే అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ప్రజల్లోకి ఉధృతంగా వెళుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని, ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అర్హులైన ఫోటో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా చాలా మంది పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీసం విలువ నీడ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని కాపాడుకునే పరిస్థితులు కూడా లేవని అన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే, అనారోగ్యం బారిన పడితే, వైద్యం చేయించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల హెల్త్ కార్డును కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వానికి నివేదిస్తామని, అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉన్నప్పుడు తనను కలిస్తే, చేతనైనంత మేరకు అండగా ఉంటామని బదులిచ్చారు. ఎలాంటి అధైర్య పడొద్దని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్ ను ఫోటో జర్నలిస్టు సంఘం నాయకులు సన్మానించారు. మెమెం టోను అందజేశారు. పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి

- BJYM ఆధ్వర్యంలో రాస్తారోకో...

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 22:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి చేపట్టిన ఈ ఆందోళనలో నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. జీఓ 97 వల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని పునఃపరిశీలించి జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ రాస్తారోకోలో పట్టణ 2 అధ్యక్షుడు బసంతపూర్ రమేష్ రెడ్డి, బీజేవైఎం నాయకులు సోమ అనిల్, నరేష్ పాటిల్, అఖిలేష్ యాదవ్, ప్రజ్వల్, ప్రవీణ్, కార్తీక్ రాజు పాల్గొన్నారు.



# అల్గోల్ రహదారి అభివృద్ధికి చర్యలు హామీల్లో 80 శాతం అమలు చేశాం

- సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి...

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 22:** గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని అల్గోల్ గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 80 శాతం వరకు అమలు చేశామని పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రహదారి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అల్గోల్ ప్రధాన రహదారిపై మట్టిని పోసి లెవలింగ్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయిన అనంతరం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.అభివృద్ధి పనులను సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు అలోక్, ముబీన్, మాజీ అల్గోల్ బీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ బక్కన్న, గ్రామస్తుడు నరేష్ తదితరులు పరిశీలించారు.రహదారి పనులు పూర్తయితే గ్రామ ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రయాణ సమయం, ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# ఉద్యమం చెక్కిన శిల్పం రమణా రెడ్డి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**



ప్రముఖ శిల్పిగా ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాలలో పర్యటించి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న ప్రముఖ శిల్పి ఎం.వి.రమణారెడ్డిని తెలంగాణ ఉద్యమం పరిపూర్ణ శిల్పిగా చెక్కిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.శనివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఎం.వి. రమణా రెడ్డి శిల్పి జీవన ప్రస్థానంపై " ఉద్యమ శిల్పి " పుస్తకాన్ని చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ శిల్పిగా అమరవీరుల జ్యోతిని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని, ఢిల్లీ రిపబ్లిక్ దినోత్సవంలో తెలంగాణ శకటాన్ని రూపం ఇచ్చిన ప్రముఖ శిల్పిగా ఎం.వీ.రమణారెడ్డి ప్రతి ఒక్కరి హృదయాలను ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం జర్మనీ దేశ పౌరసత్వాన్ని వదులుకొని కళాకారులను శిర్పులను ఏకం చేసి ఉద్యమంలో క్రియాశీలప్ప పాత్ర పోషించిన రమణారెడ్డికి బంగారు భవిష్యత్తు ఉందని చిన్నారెడ్డి అన్నారు. రమణారెడ్డి పద్మశ్రీ అవార్డుకు అర్హులు అని ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్ లర్ పదవికి తగిన వ్యక్తి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి జింబో రాజేందర్, సిద్దిపేట కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చింతలపల్లి జనార్దన్ రెడ్డి, తెలంగాణ భాష సంస్కృతి సాంస్కృతిక మండలి వ్యవస్థాక వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ గంటా జలంధర్ రెడ్డి, ప్రముఖులు కెప్టెన్ పాండురంగారెడ్డి, ప్రొఫెసర్ విష్ణువర్ధన్ రెడ్డి, రాజమోహన్, పాల్గొన్నారు.

# రూ.15 లక్షల విలువైన ఎల్ఓసీలు అందజేసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 22: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన రూ.15 లక్షల విలువైన ఎల్ఓసీలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అందజేశారు.కవెల్లి గ్రామానికి చెందిన అందోల్ మాణిక్‌రావు తండ్రి పద్మరావుకు రూ.5 లక్షలు, పస్తాపూర్ గ్రామానికి చెందిన ఏం. అనిల్ తండ్రి మొగులయ్యకు రూ.5 లక్షలు, గుంతమర్పల్లి గ్రామానికి చెందిన ఎన్. రాజుగౌడ్ తండ్రి శ్రీనివాస్ కు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల ఎల్ఓసీలు మంజూరయ్యాయి.మంజూరైన ఎల్ఓసీలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం అందజేశారు. అత్యవసర వైద్య చికిత్స సమయంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మంచినీళ్ల బండ గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత

- ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలి
- ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యం -మంత్రి పొన్నం ప్రభాకర్

**మంచినీళ్లబండ వెలుతురు ఆగస్టు 22:**

హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న “పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన” కార్యక్రమంలో భాగంగా మంచినీళ్ల బండ గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీళ్ల బండ నుంచి యాటకర్లపల్లి వరకు రూ.2.05 కోట్లతో నిర్మించిన నూతన బీటీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విజయవంతమైన ఆయిల్‌పామ్ రైతుకు మంత్రి అభినందనలు గ్రామానికి చెందిన రైతు చిన్నబోయిన అజయ్ ప్రభాకర్ విజయవంతంగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రైతు అనుభవాలను అడిగి తెలుసుకుని, ఆయిల్‌పామ్ సాగులో సాధిస్తున్న విజయానికి అభినందనలు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో అన్ని ఖర్చులు పోను ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని రైతు మంత్రికి వివరించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని మంత్రి సూచించారు. మంచినీళ్ల బండ గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి నివేదిక

- గ్రామంలో 102 పెన్షన్లు ఉండగా, ప్రతి నెల సుమారు రూ.2.60 లక్షలు విడుదల అవుతున్నాయి.
- 9 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, మొత్తం 9 ఇళ్లు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి.
- 105 కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోంది. ఇప్పటివరకు రూ.7.16 లక్షల మేర లబ్ధి చేకూరింది.
- 33 స్వయం సహాయక సంఘాలకు రూ.9.21 లక్షల వడ్డీలేని రుణాలు అందించారు.
- 156 కుటుంబాలకు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద రూ.3.28 లక్షలు విడుదల చేశారు.
- రైతు భీమా కింద ఇద్దరు రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చెక్కులు అందించారు.
- 296 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.37.83 లక్షలు విడుదల చేశారు.
- 31 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.
- 11 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించారు.
- MPPS పాఠశాలలో రూ.1.50 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మించారు.
- సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేశారు.
- గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.2.13 కోట్ల మేర పనులు చేపట్టారు.
- యాటకర్లపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- ఓపెన్‌వెల్ పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు.
- అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- గ్రామానికి బస్ సౌకర్యం కల్పించారు.
- విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించారు.
- గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- గ్రామ సర్పంచ్ నరేంద్ల కుమార్ గ్రామంలోని అవసరాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాలు అవసరమని తెలిపారు.
- అలాగే యాటకర్లపల్లి నుంచి దుర్గమ్మ ఆలయం వరకు బీటీ రోడ్డు, యాటకర్లపల్లిలో అంగన్వాడీ భవనం నిర్మించాలని కోరారు. హుస్నాబాద్- మంచినీళ్ల బండ మీదుగా హనుమకొండ వరకు రెండు ట్రిప్పుల బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
- ప్రజల నుంచి వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతిపత్రాలను మంత్రి స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- రైతులు, మహిళలు, ప్రజలకు మంత్రి సూచనలు
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయిల్‌పామ్ సాగును మరింత పెంచాలని మంత్రి సూచించారు. నీటి సంరక్షణ కోసం జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.
- అర్హులైన వారు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, PM సూర్య ఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని మంత్రి సూచించారు.
- ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.



ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో రామ్మూర్తి, ఎమ్మార్వో మధుసూదన్, సర్పంచ్ నరేంద్ల కుమార్, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధుల ముసుగులో గంజాయి రవాణా.. ఐదుగురు అరెస్ట్

- **హైదరాబాద్‌లో 38 కిలోల డ్రై గంజాయి స్వాధీనం.. విలువ రూ.10 లక్షలు**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

వయసు పైబడిన ప్రయాణికులపై సాధారణంగా అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని హైదరాబాద్ సీసీఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 38 కిలోల డ్రై గంజాయిని, దీని విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ఆగస్టు 21న విశ్వసనీయ సమాచారం అందడంతో సీసీఎస్ క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులతో కలిసి దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన వారిలో రాజారాం స్వామి కన్ను పడయాచి (78), సంతోష్ బాలారం ప్రజాపతి (65), విజయలక్ష్మి కలియమూర్తి పిల్లై (66), సిల్మినా కుజూర్ (36), షీలా దేవి (48) ఉన్నారు. వీరిలో కొందరు కూలీలు, మరి కొందరు గృహ సహాయకులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### అరకు నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి..

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి, బ్రౌన్ కలర్ పార్సిల్ కవర్లలో ప్యాక్ చేసేవారు. అనంతరం బస్సుల్లో గంజాయి పార్సిళ్లను హైదరాబాద్‌కు తరలించి, ఇక్కడ మరో బస్సు ఎక్కి ముంబైకి వెళ్లేవారు. అక్కడ ముందుగా సూచించిన ప్రాంతాల్లో గంజాయి పార్సిళ్లను అప్పగించేవారు.

### వయసును అడ్డుపెట్టుకుని..

వృద్ధ ప్రయాణికులపై అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని అక్రమ రవాణా నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అరకు నుంచి బయలుదేరే సమయంలో పార్సిళ్లను తమ సాధారణ సామాన్లతో కలిపి తీసుకెళ్లేవారు. అనుమానం రాకుండా హైదరాబాద్ చేరుకున్న తర్వాత కొంతసేపు వేరే లాడ్జిలో బస చేసి, ముందుగా నిర్ణయించిన మరో బస్సులో ముంబైకి వెళ్లేవారని పోలీసులు



తెలిపారు. ప్రతి డెలివరీకి నిందితులకు సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కమీషన్ చెల్లించేవారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

### గతంలోనూ గంజాయి రవాణా?

అరెస్టైన నిందితులకు గతంలోనూ గంజాయి రవాణాకు సంబంధించిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన వ్యక్తి ఎవరు? అరకు నుంచి గంజాయిని సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ ఎంత విస్తరించింది? ముంబైలో పార్సిళ్లను స్వీకరిస్తున్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.ఈ ఆపరేషన్‌ను సీసీఎస్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చి. సుధాకర్ రావు, ఎస్ఐ ఎన్. గౌరేందర్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి గాంధీనగర్ పోలీసుల సమన్వయంతో నిర్వహించారు. డీసీపీ, సీసీఎస్ ఎస్. చైతన్య కుమార్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### ప్రజలకు పోలీసుల హెచ్చరిక

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం లేదా పంపిణీలో ఎవరూ భాగస్వాములు కావొద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డబ్బు కోసం క్యారియర్‌లుగా వ్యవహరించినా ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘాను మరింత పెంచి, నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# జహంగీర్ నగర్‌లో ఘనంగా 'మెగా గెలాక్సీ కేఫ్' ప్రారంభం

**ఎల్బీనగర్, వెలుతురు ఆగస్టు 22:**

జహంగీర్ నగర్ కాలనీ, చింతలకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మెగా గెలాక్సీ కేఫ్' ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. కేఫ్ నిర్వాహకులు మహంకాళి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేఫ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మహంకాళి మహేష్ మాట్లాడుతూ. . తనకు 20 ఏళ్ల అనుభవం ఉందని, వినియోగదారులకు నాణ్యమైన రుచికరమైన ఇరానీ చాయ్, ఫిల్టర్ కాఫీ, బేకరీ ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యంగా స్వచ్ఛమైన పాలతో, ఎలాంటి కెమికల్స్ ఉపయోగించకుండా ఇరానీ చాయ్‌ను తయారు చేస్తున్నామని తెలిపారు. చాయ్ తయారీలో పతంజలి చక్కెరను కూడా ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు.నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మంచి రుచిని అందించేందుకు కృషి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జహంగీర్ నగర్



కాలనీ స్థానికులు, ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కేఫ్ నిర్వాహకులను అభినందిస్తూ వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# బస్తీ దవఖానాలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ

- **నెం. 7122/E1/DMHO/HYD/2025 తేదీ: 13-08-2026**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

హైదరాబాద్ జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో, DM&HO, హైదరాబాద్ వారి నియంత్రణలో NHM / NUHM పథకాల కింద మెడికల్ ఆఫీసర్ పోస్టులను తాత్కాలికంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి 20-08-2026 నుండి 22-08-2026 వరకు దరఖాస్తులను ఆహ్వానించడం జరిగింది.అయితే, 22-08-2026 (నాల్గవ శనివారం) అన్ని జాతీయీకృత బ్యాంకులకు సెలవు కావడంతో, కొంతమంది దరఖాస్తుదారులు DD (డిమాండ్ డ్రాఫ్ట్) పొందలేకపోయినట్లు అభ్యర్థులు తెలియజేశారు.అందువల్ల, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులను సమర్పించే గడువును మరో ఒక రోజు, అనగా 24-08-2026 వరకు పొడిగించడం జరిగింది. పూర్తి చేసిన దరఖాస్తులను 24-08-2026న ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు క్రింది చిరునామాలో సమర్పించవచ్చు: జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయం (O/o. DM&HO), 4వ అంతస్తు, GHMC భవనం, పాట్నీ, సికింద్రాబాద్, హైదరాబాద్.

# అర్జున అవార్డు గ్రహీత, ధనుష్ శ్రీకాంత్‌కు స్పోర్ట్స్ సన్మానం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

అర్జున అవార్డు గ్రహీత, తెలంగాణకు చెందిన ప్రముఖ షూటర్ ధనుష్ శ్రీకాంత్ శనివారం ఎల్బీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ధనుష్ శ్రీకాంత్‌ను అభినందించి, షూటింగ్ క్రీడలో సాధించిన అద్భుత విజయానికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ధనుష్ శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించి, షూటింగ్ క్రీడలో ఆయన సాధించిన విశిష్ట విజయాలను అభినందించారు. తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన ధనుష్ శ్రీకాంత్‌కు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ అనిత



డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాస్ రవితేజ రవీందర్, పి ఆర్ ఓ కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో అంబేడ్కర్ హౌస్‌ను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

- **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లండన్‌లోని ప్రసిద్ధ అంబేడ్కర్ హౌస్‌ను సందర్శించారు.**

**లండన్ వెలుతురు ఆగస్టు 22:**



బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1921-22లో లండన్‌లోని ప్రిమ్‌రోజ్ ప్రాంతంలోని 10 కింగ్ హెన్రీ'స్ రోడ్‌లో నివసించిన ఇంటిని సీఎం సందర్శించారు."మహనీయులు డాక్టర్ అంబేద్కర్ గారి హౌస్‌ను సందర్శించడం ఒక ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించడం లాంటిది. ఇది జీవితకాలపు స్ఫూర్తినిస్తుంది. సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేయాలన్న నా ఆకాంక్ష మరింత పెరిగింది" అని సీఎం రేవంత్ రెడ్డి సందర్శకుల డైరీలో రాశారు.అంబేద్కర్ హౌస్‌ను ప్రస్తుతం డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అంకితమైన మ్యూజియంగా ఏర్పాటు చేశారు. రాజ్యాంగబద్ధత, సమానత్వం, కులరహిత సమాజం, అణచివేత లేని సమాజం, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం వంటి ఆయన సిద్ధాంతాలను ఈ మ్యూజియం ప్రతిబింబిస్తుంది. దాదాపు గంటపాటు సాగిన పర్యటనలో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ (ACDA) చైర్ Ms. సంతోష్ దాస్ MBE, యూకేలో బాబాసాహెబ్ జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.పర్యటన పూర్తయిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "నా జీవితంలో ఇది గొప్ప క్షణాల్లో ఒకటి. భారతీయుల్లో గొప్ప వ్యక్తుల్లో ఒకరైన డాక్టర్ అంబేద్కర్ జీవితంలోని వ్యక్తిగత కోణాన్ని చూసి, ఆయనతో ముడిపడిన వస్తువులను తాకగలగడం ఎంతో గొప్ప అనుభూతి" అని అన్నారు.



# సుభాష్ నగర్ స్టీల్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి: ఆకుల సతీష్ అండ్ టీమ్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ఆగస్టు 22:**

సుభాష్ నగర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ఆకుల సతీష్ ఆధ్వర్యంలోని బృందం సందర్శించి పరిశీలించింది. గత 8 నెలలుగా పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కుత్బుల్లాపూర్ గ్రామం, అయోధ్య నగర్ చౌరస్తా నుంచి సుచిత్ర వరకు ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతూ వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది.స్టీల్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆకుల సతీష్ అండ్ టీమ్ పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పత్రికా ముఖంగా కోరారు.అదేవిధంగా, బ్రిడ్జి ప్లానింగ్‌లో పలుమార్లు మార్పులు చేయడం వల్లే పనుల్లో జాప్యం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారని బృందం పేర్కొంది. అభివృద్ధి పనుల్లో రాజకీయ కారణాలతో జాప్యం జరిగితే చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేనని వారు అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకుని జోనల్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి స్టీల్ బ్రిడ్జి పనులను యుద్ధ



ప్రాతిపదికన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ అండ్ టీమ్ డిమాండ్ చేసింది."రాజకీయాలకు అతీతంగా ప్రజల సౌకర్యమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి" అని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, కంది శ్రీరాములు, హనుమాన్ జీ పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో భవనం కూలిన ఘటన.. తెలంగాణ ఫైర్ డిపార్ట్‌మెంట్ ముమ్మర సహాయక చర్యలు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న జీ+6 భవనం ఈరోజు మధ్యాహ్నం 1:00 గంటల సమయంలో కూలిపోయింది. ఈ ఘటనలో పక్కనే ఉన్న భవనం కూడా దెబ్బతినడంతో కొంతమంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం అందింది .సమాచారం అందిన వెంటనే తెలంగాణ ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది అప్రమత్తమై, రెస్క్యూ బృందాలు, ప్రత్యేక పరికరాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లిష్ట పరిస్థితుల మధ్య ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బంది విస్తృతంగా గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు.అత్యాధునిక రెస్క్యూ పరికరాల్లో భాగమైన విక్టిమ్ లొకేషన్ కెమెరాను వినియోగించి శిథిలాల కింద బాధితులు ఉన్న ప్రాంతాలను గుర్తించారు. సహాయక చర్యల్లో భాగంగా శిథిలాల కింద ఇద్దరు మృతులను గుర్తించి వెలికితీశారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను రీజినల్ ఫైర్ ఆఫీసర్ శ్రీ సుధాకర్‌రావు నేతృత్వంలో జిల్లా ఫైర్ అధికారులు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారులు, స్టేషన్ ఫైర్ అధికారులు, ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బంది నిర్వహించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ గాలింపు చర్యలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేం దుకు సిబ్బంది నిరంతరం శ్రమించారు.కూలిన నిర్మాణం పక్కనే ఉన్న భవనాన్ని కూడా ప్రభావితం చేయడంతో అక్కడి నివాసితుల భద్రతకు ఫైర్ అధికారులు ప్రాధాన్యత ఇచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా రాత్రి సమయంలో ప్రభావిత భవనాల్లో ఉండవద్దని నివాసితులకు సూచించి, వారికి అవసర మైన భద్రతా సూచనలు అందించారు.జీహెచ్ఎంసీ అధికారులు రేపు భవనం స్థిరత్వాన్ని పరిశీలించనున్నారు. భవనం నివాసానికి సురక్షితంగా ఉందని జీహెచ్ఎంసీ నిర్వహించే స్థిరత్వ అంచనాలో నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే ప్రభావిత భవనంలోకి తిరిగి వెళ్లాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్ శ్రీ సుధాకర్‌రావు నివాసితులకు సూచించారు.తెలంగాణ ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ శాఖ సంబంధిత అధికారులు, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సంఘటనా స్థలంలో సహాయక, రెస్క్యూ చర్యలను కొనసాగిస్తోంది. నివాసితుల భద్రతను నిర్ధారించడంతో పాటు రెస్క్యూ, సహాయక చర్యలను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతోంది.ఈ



రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న జిల్లా ఫైర్ అధికారులు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారులు, స్టేషన్ ఫైర్ అధికారులు, ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బందిని తెలంగాణ ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ శాఖ డీజీ అభినందించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్పందించడం, ప్రత్యేక పరికరాలను వినియోగించడం, క్లిష్ట పరిస్థితుల్లోనూ నిరంతరాయంగా సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది అంకితభావాన్ని ప్రశంసించారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 27-08-2026న ఇందిరా పార్క్ వద్ద TGEJAC ధర్నా

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

శనివారం రోజున టీజీవో భవనంలో టీజీవో హైదరాబాద్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం . హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి.కృష్ణ యాదవ్. కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ ఖాదర్. ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా tgos రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ గారు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా ఉద్యోగులు అందరూ 27 తారీఖు నాడు జరిగే నిరసన దినాన్ని పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.. హైదరాబాద్ జిల్లా శాఖ పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం TGEJAC రాష్ట్ర బాడీ పిలుపు మేరకు 27-08-2026న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు TGO's హైదరాబాద్జిల్లా శాఖ బాడీ ప్రకటించింది.ఈ సందర్భంగా 22-08-2026న జరిగిన TGO's హైదరాబాద్జిల్లా శాఖ బాడీ సమావేశంలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణపై చర్చించారు.

**ప్రధాన డిమాండ్లు:**

- **2వ PRCని వెంటనే అమలు చేయాలి.**
- **పెండింగ్‌లో ఉన్న 6 విడతల DA & DRను వెంటనే విడుదల చేయాలి.**
- **CPSను రద్దు చేసి OPSను పునరుద్ధరించాలి.**
- **టిజిఓ హైదరాబాద్ జిల్లా వార్షిక మెంబర్షిప్ డ్రైవ్ 2026.**
- **నూతన EHSను సమర్ధవంతంగా అమలు**




**చేయాలి.**

- **వారానికి ఐదు రోజులు జిహెచ్ఎంసి పరిధిలోని ఏరియా ఉద్యోగులందరుకు వెసులుబాటు కల్పించాలని కోరారు..**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు 27-08-2026న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై, మన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని TGO'S హైదరాబాద్ జిల్లా శాఖ బాడీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో జి ఆశన్న. ఎస్జీల రెడ్డి. వెంకటరమణ. డాక్టర్ ఎం సురేందర్. ఏ రాజేందర్. ఎం శ్రీనివాసులు. రాధాకృష్ణ. డాక్టర్ సునీత జోషి. జి ప్రభాకర్. విద్యాసాగర్. పేరయ్య. డాక్టర్ బి కుమార్. డాక్టర్ జి గాయత్రీ దేవి. వి స్వప్నిల్. చాంద్ బాషా.గౌస్. శోకతు హుస్సేన్. ఏం రవీందర్. వివేకానంద రెడ్డి. బి జ్యోతి. టీవీ సరస్వతి. డాక్టర్ వి సాయి బాబా. జివిఎస్ చంద్రజ్యోతి.పూనం పాల్గొన్నారు

మన హక్కుల కోసం – మన డిమాండ్ల సాధన కోసం – ఐక్యంగా పోరాడుదాం!

# హిమాయత్ నగర్ డివిజన్ విట్టల్ వాడిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారుల పరిశీలన

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు, డివిజన్‌లోని విట్టల్ వాడి మెల్కోటి పార్క్ ఎదురుగా ఉన్న బస్తీలో త్రాగునీటి సమస్య తలెత్తడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ జలమండలి మేనేజర్ మున్నవర్ (Munnawar)ను అక్కడికి తీసుకెళ్లి స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శివాలయం వద్ద పైపులైన్లో కొంత చెత్త చేరడం వల్ల నీటి ప్రెజర్ తగ్గుతున్నట్లు అధికారులు గుర్తించారు. రేపు లేదా ఎల్లుండి ప్రత్యేక వాహనాన్ని (బండి) ఏర్పాటు చేసి పైప్‌లైన్‌ను క్లియర్ చేయిస్తే నీటి ప్రెజర్ సాధారణ స్థితికి వస్తుందని వారు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో స్థానిక నాయకులు అనిల్ ముదిరాజ్ మరియు తదితర స్థానికులు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం

**జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణకు చేస్తున్న కృషిపై ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని దేశంలోని పలు రాష్ట్రాలతో ఏర్పడ్డ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ శ్రీ కే. శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధులకు అకాడమీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సేవలు, విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు అందిస్తున్న ట్యూషన్ ఫీజు సహాయం, అలాగే జర్నలిస్టు కుటుంబాలకు అందిస్తున్న ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు.తెలంగాణ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23,000 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, వాటిని సంబంధిత ఎంపీలు మరియు అన్ని రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్షాపులు, అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్లు, పుస్తకాలు అందిస్తున్న విధానాన్ని కూడా ప్రతినిధులు పరిశీలించారు. మీడియా అకాడమీ కోసం నిర్మించిన ఆధునిక సౌకర్యాలతో కూడిన ఐదు అంతస్తుల భవనం, శిక్షణా తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యం కలిగిన సెంట్రల్ ఏసీ ఆడిటోరియం తదితర సౌకర్యాలను ప్రతినిధి బృందం సందర్శించింది. జర్నలిస్టుల



సంక్షేమం కోసం ఇంతటి సమగ్ర మౌలిక వసతులతో అకాడమీ పనిచేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా కాకుండా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ప్రతినిధులు ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఫెడరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమం మరియు శిక్షణ రంగాల్లో అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి అకాడమీ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్కు చెందిన నీలేష్ కాంతాహా, హారీష్ పగిడే, సంజయ్ మహతా (మధ్యప్రదేశ్), సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ తండ్, లక్షణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రెసిడెంట్ గౌతమ్ పహాని, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, మెంబర్ అనిల్ సింగ్, సెక్రటరీ జనరల్ రాజేష్ ధల్, మెంబర్ రమేష్ హండా, ట్రెజరర్ నీరజ్ ఠాకూర్, వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ రమేష్, ఏ. రాజేష్, మిడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓ.ఎస్.డి. ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.



# పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

"తెలంగాణకు రండి తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'' అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం——ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్లోని ఐటీసీ కోహినూర్లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్షిప్ కాన్క్లేవ్–2026' లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.2025–26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్–2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు.ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే CURE, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే PURE, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే RARE——ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు."అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి'' అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు.హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు.తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరు–వ్యవసాయం–ఆహార భద్రత–పరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు. సాగునీటి నిర్వహణను మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధ, డ్రోన్లు, సెన్సర్లు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే రంగాల్లో పెట్టుబడులను తెలంగాణ స్వాగతిస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం నీటి ప్రతి చుక్కను మరింత విలువైనదిగా మార్చగలదని, రైతుకు మరింత భరోసా కల్పించగలదని పేర్కొన్నారు.తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను కేవలం ముడిసరుకుగా బయటకు పంపే పరిస్థితి నుంచి రాష్ట్రంలోనే శుద్ధి చేసి, విలువ జోడించి, బ్రాండ్గా తీర్చిదిద్ది, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. అందుకోసం ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, గిడ్డంగులు, వ్యవసాయ లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, ఎగుమతుల రంగాల్లో భారీ పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. వ్యవసాయానికి పరిశ్రమను అనుసంధానించడం ద్వారా రైతుకు మెరుగైన ధర లభించడంతోపాటు గ్రామీణ యువతకు వారి ప్రాంతాల్లోనే ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు.పెట్టుబడిదారులు హైదరాబాద్ను దాటి తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలు, అభివృద్ధి కేంద్రాల వైపు కూడా దృష్టి సారించాలని ఉత్తమ్ కోరారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్నగర్ వంటి నగరాలు భవిష్యత్ పారిశ్రామిక, సేవా, లాజిస్టిక్స్, ఆహార శుద్ధి కేంద్రాలుగా ఎదగగల అపార సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులు జిల్లాలకు విస్తరించినప్పుడే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయని, అభివృద్ధి నిజమైన అర్థంలో ప్రజాస్వామీకరణ చెందుతుందని పేర్కొన్నారు.స్టార్టప్లు, గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తున్న డాక్టర్ జె.ఎ. చౌదరి, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ కృషిని మంత్రి అభినందించారు. వ్యాపార విజయాన్ని కేవలం ఆదాయం, లాభాలు, కంపెనీల విలువలతో కొలిచే కాలాన్ని దాటి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోరుకుంటున్న పెట్టుబడులు కేవలం మూలధనాన్ని తీసుకురావడానికే పరిమితం కాకూడదని ఉత్తమ్ స్పష్టం చేశారు. అవి ఉపాధిని సృష్టించాలి, జ్ఞానాన్ని పంచాలి, సాంకేతికతను బదిలీ చేయాలి, సుస్థిర పరిశ్రమలకు పునాది వేయాలి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి. ప్రభుత్వం కూడా పెట్టుబడిదారులతో తాత్కాలిక అనుబంధాన్ని కాకుండా పారదర్శకమైన, వృత్తిపరమైన, వేగంగా స్పందించే దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు."తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలో ఆవిష్కరించండి. ప్రపంచం రేపు ఎదుర్కొనే సమస్యలకు అవసరమైన పరిష్కారాలు తెలంగాణ నేలపై ఊపిరిపోసుకోవాలి. ఇక్కడి ప్రతిభతో రూపుదిద్దుకోవాలి. ఇక్కడి పరిశ్రమల నుంచి ప్రపంచానికి చేరాలి. పెట్టుబడిదారుల విజయాన్నీ, తెలంగాణ ప్రజల అభ్యున్నతినీ ఒకే ప్రయాణంగా మలచడమే మా లక్ష్యం'' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# రోడ్డు భద్రతకు సమష్టి కృషి అవసరం — సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

- **Honda, సర్వేజనా ఫౌండేషన్, సైబరాబాద్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో "Ideal Town on Road Safety — Hyderabad" కార్యక్రమం ప్రారంభం**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

హైదరాబాద్లో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడం, ప్రజల్లో బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై అవగాహన పెంచడం లక్ష్యంగా Honda Motorcycle & Scooter India Pvt. Ltd., సర్వేజనా ఫౌండేషన్, సైబరాబాద్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో "Ideal Town on Road Safety – Hyderabad" కార్యక్రమాన్ని శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ – ట్రాఫిక్ సన్ప్రీత్ సింగ్, ఐపీఎస్., హాజరయ్యారు. హోండా మోటార్సైకిల్ & స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరఫున కార్పొరేట్ అఫైర్స్ ఆపరేటింగ్ హెడ్ శ్రీ ప్రభు నాగరాజ్, సర్వేజనా ఫౌండేషన్ తరఫున చైర్మన్ డా. ఎ.వి. గురవ రెడ్డి, సీఈవో డా. బి. జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబరాబాద్లో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేసేందుకు హోండా సంస్థ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొంటూ సంస్థ ప్రతినిధులను అభినందించారు. రోడ్డు భద్రతపై అవగాహన చిన్నప్పటి నుంచే కల్పించాలని, ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడం ద్వారా బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులను తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఒక కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే, ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్బెల్ట్ వంటి రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తనకు గతంలో జరిగిన ఒక ప్రమాదంలో సీట్బెల్ట్ ధరించి ఉండటం వల్ల తీవ్ర గాయాలు కాకుండా బయటపడిన అనుభవాన్ని సీపీ పంచుకున్నారు. ఈ అనుభవం ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ – ట్రాఫిక్ సన్ప్రీత్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించే సమయంలో హోండా సంస్థ ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో రహదారి రూపకల్పనలో లేదా ఇతర ఇంజినీరింగ్ పరమైన లోపాలు ఉంటే గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణలో కేవలం ట్రాఫిక్ నిబంధనల అమలే కాకుండా, ప్రమాదాలకు కారణమయ్యే ఇంజినీరింగ్ లోపాలను గుర్తించి సరిదిద్దడం కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, పోలీస్ విభాగం, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా సర్వేజనా ఫౌండేషన్ సీఈవో డా. బి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సురక్షిత రహదారుల నిర్మాణం, సమర్థవంతమైన ఎన్ఫోర్స్మెంట్, అత్యవసర వైద్య సేవలు కీలకమని అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మరింత ముఖ్యమని పేర్కొన్నారు.సర్వేజనా ఫౌండేషన్ చైర్మన్ డా. ఎ.వి. గురవ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సేవలు అందించిన తన అనుభవం రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించేలా చేసిందన్నారు. ప్రమాదాల తర్వాత ప్రాణాలను కాపాడటంతో పాటు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో 2022లో సర్వేజనా ఫౌండేషన్ను స్థాపించినట్లు తెలిపారు.పాదచారులు, సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులు అత్యంత ప్రమాదానికి గురయ్యే వర్గాలని పేర్కొంటూ, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగం, పిల్లలకు తగిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిబంధనల పాటింపు ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. హోండా



మోటార్సైకిల్ & స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ అఫైర్స్ ఆపరేటింగ్ హెడ్ శ్రీ ప్రభు నాగరాజ్ మాట్లాడుతూ, డ్డు ప్రమాదాల కారణంగా జరిగే మరణాలు, గాయాలను తగ్గించడం హోండా సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాల్లో రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలనే లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. రోడ్డు భద్రత కోసం Education, Enforcement, Engineering, Emergency అనే 4Es విధానంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, కమ్యూనిటీ అవగాహన, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, భద్రతా సూచికల ఏర్పాటు, ఇంజినీరింగ్ పరమైన మెరుగుదలలు, అత్యవసర స్పందన, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.STOP – Safer Roads, Safe Livesసర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని STOP (Stop Traffic-related Deaths and Injuries through Prevention) కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు."Ideal Town on Road Safety – Hyderabad" కార్యక్రమం ద్వారా హైదరాబాద్ను ఆదర్శ రోడ్డు భద్రత నగరంగా తీర్చిదిద్దడం, ప్రజల ప్రవర్తనలో స్థిరమైన మార్పు తీసుకురావడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. "విలువైన జీవితానికి సురక్షిత ప్రయాణం – Safe Roads, Safe Lives" అనే సందేశంతో ప్రజల్లో రోడ్డు భద్రతపై నిరంతర అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు





**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ అధికారులు మరియు ఆర్బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలోని రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి అకాడమీ అధికారులు, ఆర్బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ వ్యవస్థకు వెంకట రామిరెడ్డి ఆదర్శం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు తెలంగాణ పోలీస్ అకాడమీకి, మొత్తం పోలీస్ వ్యవస్థకు నిరంతర స్ఫూర్తినిస్తోందని అన్నారు. పేదలు, బలహీన వర్గాల ప్రజలకు వెంకట రామిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని, పోలీస్ సేవలకు ఆయన ఒక నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. పోలీస్ సబ్ఇన్స్పెక్టర్ శిక్షణార్థుల సంక్షేమం కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి ద్వారా శిక్షణార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, దూరదృష్టి స్పష్టంగా తెలుస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన పేరుతో తెలంగాణ పోలీస్ అకాడమీని మరింత అభివృద్ధి చేసుకోవడం గర్వకారణమని, భవిష్యత్ పోలీస్ అధికారులకు ఆయన జీవితం, సేవలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

## విద్యారంగంలో విశేష సేవలు

ఆర్బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేసేందుకు అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, ఎంతోమందికి విద్యావకాశాలు కల్పించిన ఆయన సేవలను కొనియాడారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు....

## వెంకట రామిరెడ్డి పోలీసింగ్ శైలి ఆదర్శనీయం

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డి రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి బాల్యం, ఆయన ఎదిగిన తీరు, పోలీస్ శాఖలోకి వచ్చిన విధానం తదితర అంశాలను వివరించారు.

నిజాం కాలంలో హైదరాబాద్ కొత్వాల్గా ఆయన నిర్వహించిన బాధ్యతలు, ప్రజలతో ఆయన వ్యవహరించిన తీరు, పోలీసింగ్లో ఆయన అనుసరించిన ప్రత్యేక విధానాన్ని వివరించారు. ప్రజల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆయన అందించిన పోలీస్ సేవలు నేటి పోలీస్ అధికారులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.ప్రస్తుత పోలీస్ అధికారులు, శిక్షణార్థులు రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## ప్రత్యేక అతిథులకు జ్ఞాపికలు

కార్యక్రమం అనంతరం ఆర్బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డిలకు తెలంగాణ పోలీస్ అకాడమీ తరఫున జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, కృష్ణ, తోట శ్రీనివాసులు, తిరుపతి, జగదీశ్వర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అకాడమీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ జయంతి కార్యక్రమం ఘనంగా విజయవంతమైంది.



## ఆదిలాబాద్ ఐటీ టవర్‌తో
# ఐటీ విస్తరణకు మరో ముందడుగు: కేటీఆర్

ఆదిలాబాద్ ఐటీ టవర్ సిద్ధమైన నేపథ్యంలో, హైదరాబాద్‌కు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌లోనూ ఐటీ పరిశ్రమ విస్తరించే అవకాశం ఏర్పడిందన్నారు.త్వరలో ప్రారంభం కానున్న ఆదిలాబాద్ ఐటీ టవర్ ద్వారా ఆదిలాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల యువతీ యువకులకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు లభించాలని కేటీఆర్ ఆకాంక్షించారు.తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్ల నిర్మాణాలు చేపట్టామని ఆయన తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వరంగల్, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ నగరాల్లో ఐటీ టవర్లు ప్రారంభమయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు.అయితే, ప్రస్తుతం ఈ ఐటీ టవర్ల నిర్వ హణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నదనే వార్తలు వస్తున్నా యని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్లలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, మరిన్ని ఐటీ కంపెనీలను ఆకర్షించే చర్యలు చేపట్టాలని కోరారు.స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుంది

పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహకారం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు ప్రారంభించిన ఈ పథకాలను ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తున్నామని మంత్రి చెప్పారు. గతంలో ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్ల కోర్టు స్టే విధించిందని, విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే ప్రభుత్వం కౌంటర్‌తో పాటు వెకేట్ పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. ఈ అంశంపై కోర్టులో హియరింగ్ పూర్తయిందని పేర్కొన్నారు.

### సంక్షేమ పథకాలు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో భాగం

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు ప్రభుత్వ పాలసీలో భాగమని, పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. హైకోర్టులో ప్రభుత్వం తరపున వినిపించిన వాదనలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుని అనుకూల నిర్ణయం వస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు.ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

### ప్రతిపక్షాల వైఖరి సరికాదు

పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించే పథకం విషయంలో కూడా రాజకీయాలు చేయడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంక్షేమ పథకం ఆగిపోతే బాగుంటుందని భావిస్తూ, ప్రభుత్వం ఇబ్బందుల్లో పడాలని ప్రతిపక్షాలు శునకానందం పొందడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.పేద ప్రజలకు ఉపయోగపడే పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో ప్రతిపక్షాలు కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ అయి పేద ప్రజల ప్రయోజనాల కోసం తమ వాదనలు వినిపించాలని మంత్రి సూచించారు.

### పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

పేద కుటుంబాలకు అండగా నిలవడం, ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు. న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకుంటూనే ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు నిరంతరం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**లండన్, వెలుతురు ఆగస్టు 22:**



లండన్ లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కి చెందిన విద్యావేత్తలతో ఆయన సమాలోచనలు జరిపారు. తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వం వహించారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, కె. రామకృష్ణ రావు, జయేశ్ రంజన్ తో కలిసి హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ బృందానికి వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు భాగస్వాములు కావాలని వారు కోరారు.కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వం తరపున సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకట సెరిష్ గండికోట, తెలంగాణతో భాగస్వామ్యం చేసుకునేందుకు ఆసక్తి చూపించారు.హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, పరిశోధన, వ్యాపార ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించడం, కొత్త స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో తెలంగాణ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు పక్షాలు ఈ సందర్భంగా అంగీకరించాయి.

## చాటింగ్ చేస్తోందని భార్యను చంపేసి..
# మృతదేహాన్ని నదిలో విసిరేసి..

**యానాం వెలుతురు ఆగస్టు 22:**

పరాయి వ్యక్తితో చాటింగ్ (Chatting) చేస్తోందనే అనుమానంతో భార్యను చంపేసి నదిలో పడేశాడో వ్యక్తి. ఈ ఘటన యానాంలో (yanam) చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. యానాం పరిధి కనకాలపేటకు చెందిన చెక్కా అప్పారావు(29), భీంనగర్‌కు చెందిన పువ్వల రేఖ (26) ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల బాబు, రెండేళ్ల పాప ఉన్నారు. అప్పారావు చేపలు వేటాడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేరేవాళ్లతో రేఖ చాటింగ్ చేస్తోందని వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి 8.30కు ఇంటికొచ్చిన అప్పారావు కుమారుడికి తన చరవాణి ఇచ్చి స్నానానికి వెళ్లాడు. తిరిగొచ్చే సరికి ఆ ఫోన్ నుంచే భార్య చాటింగ్ చేస్తూ కనిపించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో భార్య ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. కిందపడిపోయిన భార్య ఛాతీపై కూర్చుని గొంతు నులమడంతో ఊపిరాడక ఆమె చనిపోయింది. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అప్పారావు తన సోదరుడికి చెందిన ఆటోలో మృతదేహాన్ని తీసుకెళ్లి మెట్టకూరు గణపతినగర్ వద్ద వంతెనపై నుంచి కోరింగ నదిలో విసిరేశాడు. శనివారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించట్లేదని ఫిర్యాదు చేశాడు. పొంతన



లేకుండా మాట్లాడుతున్న అప్పారావును పోలీసులు తమ శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకొన్నాడు. ఎస్సై పట్టాభిరామయ్య, పోలీసులు నిందితుడిని వెంటబెట్టుకుని నదిలో గాలించారు. వంతెన నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో రేఖ మృతదేహం లభించగా యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్ వద్ద ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సుల నిలుపుదల








- **జనప్రియ వెల్ఫేర్ మిషన్ కృషితో సాకారమైన విజ్ఞప్తి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

యాదాద్రి భువనగిరి జిల్లా: బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS) ఆసుపత్రికి వివిధ జిల్లాల నుండి దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు మరియు ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జనప్రియ రూరల్ అండ్ అర్బన్ కమ్యూనిటీ వెల్ఫేర్ మిషన్ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేయడం జరిగింది.బస్సు భవన్‌లోని అధికారిక కార్యాలయంలో TGSRTC ఎండీ నాగిరెడ్డి ని కలిసి, ఎయిమ్స్ వద్ద బస్సులు ఆపవలసిన ప్రాధాన్యతను వివరించి రాతపూర్వక నివేదన పత్రం అందజేశారు. సంఘం విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి , సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి అక్కడ అన్ని రకాల ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులు ఆగేవిధంగా తక్షణ ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల రోగులకు ప్రయాణ సౌలభ్యం మరింత మెరుగుపడనుంది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు: గట్టు నరసింహారావు ప్రధాన కార్యదర్శి: కూరెళ్ల వేములయ్య గౌడ్ , సభ్యులు: ఎండీ నజీర్, రాచకొండ అనిల్ చారి, కొండ సుధీర్ గౌడ్, కూరెళ్ళ సాత్విక్ గౌడ్, కందూరి సురేందర్ రెడ్డి, దాచేపల్లి హరీష్, ఎండీ రఫీద్దీన్ మరియు పలువురు స్థానికులు పాల్గొన్నారు.




# దేశంలో ఖాళీగా 8.7 కోట్ల మంది యువత- చదువు, ఉద్యోగం, శిక్షణకు దూరం: నీతి ఆయోగ్ రిపోర్ట్

దేశంలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగానికి సంబంధించి నీతి ఆయోగ్ ఒక సంచలన విషయాన్ని వెల్లడించింది. భారతదేశంలో 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల దాదాపు 8.7 కోట్ల మంది యువత ప్రస్తుతం ఎలాంటి చదువు లేదా ఉద్యోగం లేదా నైపుణ్య శిక్షణ లేకుండా ఖాళీగా ఉన్నారని తాజా నివేదిక స్పష్టం చేసింది. 2021 లో నిర్వహించిన నేషనల్ శాంపిల్ సర్వే (NSS) 78వ రౌండ్ డేటా ఆధారంగా 'రీఇమైజినింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్ @2047' పేరుతో నీతి ఆయోగ్ ఈ రిపోర్టును రూపొందించింది. స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి, స్థానికంగా డిమాండ్ ఉన్న రంగాలు, భవిష్యత్తులో అభివృద్ధి చెందే, మంచి అవకాశాలు ఉన్న ఇతర రంగాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి సబ్సిడీతో కూడిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్ని తక్షణమే అందించాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక నొక్కిచెప్పింది.

### అంతంత మాత్రంగానే ఆదాయం- మళ్లీ నైపుణ్య శిక్షణకు ఖర్చులు ఎలా?

చదువు, ఉద్యోగం, శిక్షణ లేని యువతను NEET (Not in Education, Employment, Training) పేరుతో ఇక్కడ నీతి ఆయోగ్ నిర్వచించింది. వీరు 15 నుంచి 29 మధ్య వయస్కులతో పాటు నిరుద్యోగుల్ని కూడా ఈ కేటగిరీ కింద నీతి ఆయోగ్ వర్గీకరించింది. ఈ నీట్ కేటగిరీ యువతకు ప్రధానంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించింది. నీతి ఆయోగ్ ప్రకారం– ముఖ్యంగా తగిన ఆదాయం లేకపోవడం, గతంలో చదువుల కోసం చేసిన ఖర్చుల వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఉన్న ఆర్థిక భారాల మధ్య మళ్లీ డబ్బులు చెల్లించి నైపుణ్య శిక్షణ పొందడం వారికి సాధ్యపడట్లేదు. ఇంకా తక్కువ రాబడి ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు కాలేజీ ఖర్చులు, ప్రైవేట్ ట్యూషన్లకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ డిగ్రీతో పాటు డబ్బులు కట్టి అదనంగా స్కిల్ కోర్సులు (నైపుణ్య శిక్షణ) చేయడం వారికి భారంగా మారుతోంది. ఇంకా డిగ్రీ పూర్తి చేసిన వెంటనే చాలా మంది గ్రాడ్యుయేట్లు (పట్టభద్రులు) వారి కుటుంబాల్ని పోషించుకునేందుకు తక్కువ జీతమైనా సరే ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరిపోతున్నారని నీతి ఆయోగ్ విచారం వ్యక్తం చేసింది. మరికొందరు ఉద్యోగాలు లభించక ఈ నీట్ యువతగా మిగిలిపోతున్నారని తెలిపింది.

### చదువుకు తగ్గ ఉద్యోగాలు చేస్తున్నది 8.25 శాతమే!

దేశంలో డిగ్రీ పూర్తి చేసిన వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాల్లో కొనసాగుతున్నారని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాక్టికల్ లెర్నింగ్‌కు పరిమిత సంఖ్యలో అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ లేకపోవడం వల్ల చదువుకున్న యువతలోనూ ఉద్యోగం సాధించే అర్హత తగ్గడానికి కారణమని తెలిపింది. దీంతో NEET యువతతో పాటు మహిళలకు తక్కువ ఖర్చుతో కూడిన లేదా పూర్తి సబ్సిడీతో కూడిన శిక్షణా మార్గాలు, ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. సంపాదిస్తూనే చదువుకునే అవకాశాలు కల్పించడం అత్యంత కీలకం అని స్పష్టం చేసింది.

### వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇలా చేయాల్సిందే!

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) మార్చాలనే లక్ష్యం సాధించాలంటే– దేశంలోని యువత నిరంతరం నేర్చుకుంటూ, సంపాదిస్తూ, తమ నైపుణ్యాల్ని మరింత మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగేలా చేయాలని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. ఈ లక్ష్యసాధనలో నైపుణ్యాభివృద్ధే కేంద్ర బిందువు అని, ఇదే అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది. 2014–15 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 7.67 కోట్లకుపైగా వ్యక్తులకు నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు నీతి ఆయోగ్ తన నివేదికలో వెల్లడించింది. అయితే ఈ 15–29 ఏజ్ గ్రూప్‌లో ఇంకా సుమారు 8.7 కోట్ల మంది యువత ఇంకా చదువు, ఉద్యోగం, నైపుణ్య శిక్షణకు దూరంగా ఉన్న నేపథ్యంలో వారికి కూడా అందుబాటులో ఉండే శిక్షణ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్న ఆవశ్యకతను నొక్కిచెబుతోంది.




# పేదలపై ప్రభుత్వ ప్రతాపమా?

**హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఉన్న పేదల దుకాణాలు కూల్చేశారు**

**తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్ సింగ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద పేదల దుకాణలను ధ్వంసం చేయటం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి దుర్గం చెరువు వద్ద సర్వే నంబర్ 83లో కూల్చేసిన పేదల దుకానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భూమిలో ఎన్నో ఏళ్లుగా పేదలు దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. పేదల జీవనాధారమైన దుకాణాలు తొలగించొద్దని హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిందని, అయినా రాత్రికి రాత్రే అధికారులు దుకాణాలు తొలగించి పేదల ఉపాధి దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్ ను చించేసి మరి కూల్చివేతలు చేపట్టారంటే వారికి కోర్టులంటే ఏమాత్రం గౌరవం లేదని తేలిపోతుందన్నారు. పేదల దుకాణాలు కూల్చేసిన స్థలాన్ని ఒక బడా కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ప్రజాపాలన తెస్తామని



అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి పేదలపై తమ ప్రతాపాన్ని చూపించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి హైకోర్టు ఆర్డర్ అమలు చేయాలని, లేనిపక్షంలో తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- **పేదల సొంతింటి కలకు మరింత ఊతం.. త్వరలో రెండు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు**
- **ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో వేగంగా భూ సర్వే**
- **హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్**

**నిజామాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో కలిపి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలో మరో రెండు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెవెన్యూ, హౌసింగ్, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యులు మహేష్‌కుమార్ గౌడ్ కలిసి మాట్లాడారు. పేదలకు కేటాయించే ఇంటి స్థలాలు భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు గురికాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే భూముల సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. నిపుణులు, రైతులు ఇచ్చిన సూచనల మేరకు తొలుత 10 జిల్లాల్లోని 70 గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. అదేవిధంగా నక్షాలు లేని 413 గ్రామాల్లోనూ సర్వే నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నామని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.




**ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం**

గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రజలకు జవాబుదారీగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు తరచూ అధికారులను కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించామని తెలిపారు. అధికారులు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించకుండా ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నిజామాబాద్ ప్రజల కోరికకు అనుగుణంగా హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి ప్రకచారు.ఇందుకోసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి 10–15 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. నిజామాబాద్‌తో పాటు సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలను గుర్తించి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, కమీషన్లు తీసుకునేవారు, దందాలు చేసేవారు, విషపూరిత ఆలోచనలతో వ్యవహరించేవారికి తాము ఎలాంటి సమాధానం ఇవ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ గారి లేఖ

- **తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకరంగా వ్యాఖ్యలు చేయిస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలి**
- **కమిటి ఛైర్మన్ మల్లు రవి గారికి విజ్ఞప్తి చేసిన మంత్రి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

టిపిసిసి క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తుండటం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి గారిని కోరుతూ మంత్రి సురేఖ లేఖ రాశారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలని మంత్రి సురేఖ కోరారు. "పార్టీ క్రమశిక్షణపై నాకు పూర్తి గౌరవం ఉంది. అదే సమయంలో, ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన నాపై తీవ్ర మాటలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నారాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మీడియా ముందుకు రావడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలి" అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి వున్న పార్టీ అని, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ కోరారు.



# LFC-2 ఫైట్ నైట్‌లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**



కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన లెగసీ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ (LFC–2) ఫైట్ నైట్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఫైటర్ల మీట్ & గ్రీట్‌లో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, SAT చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అనంతరం జరిగిన తొలి బౌట్‌లో హైదరాబాద్‌కు చెందిన బాస సశ్రీక్, ఇండోర్‌కు చెందిన అరుణ్ వర్మ తలపడ్డారు.బౌట్ అనంతరం విజేతను మంత్రి వాకిటి శ్రీహరి అభినందించి సన్మానించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మార్షల్ ఆర్ట్స్, ఫైటింగ్ స్పోర్ట్స్‌కు తెలంగాణలో మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ద్వారా క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.LFC–2 ఫైట్ నైట్ ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫైటర్లకు ప్రోత్సాహం అందించారు. "క్రీడల్లో గెలుపు ఒక్కటే కాదు.. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట స్ఫూర్తి కూడా ముఖ్యమే. యువత క్రీడల వైపు అడుగులు వేయాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.



# విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ సర్కార్ చెలగాటం

హైదరాబాద్లోని నాంపల్లిలో గల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యాశాఖకు కనీసం మంత్రి కూడా లేకపోవడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. బీహార్ లాంటి రాష్ట్రంలో విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయిస్తుంటే, తెలంగాణలో కేవలం 7 నుంచి 8 శాతం మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30,014 స్కూళ్లలో 21,126 బడులు శిథిలావస్థలో ఉండటం, దాదాపు 1,752 పాఠశాలల్లో బాలికలకు కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడం విద్యావ్యవస్థ పతనానికి నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం లేక అనేక మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురై ఆసుపత్రుల పాలవుతున్నా పట్టించుకోని ముఖ్యమంత్రి, పెట్టుబడుల పేరుతో విదేశీ టూర్లు చేస్తూ రాష్ట్రాన్ని దోచుకునే ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ తో పాటు పాత బకాయిలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, నేడు ఆ మాటను పూర్తిగా విస్మరించారని మహేశ్వర్ రెడ్డి దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్మెంట్ కింద సుమారు రూ. 15,000 కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పడటంతో, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆపుతున్నాయన్నారు. దీనివల్ల సుమారు 50 లక్షల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి సర్టిఫికెట్లు విడిపించుకోవాల్సిన దయనీయ దుస్థితి ఈ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏర్పడిందని విమర్శించారు.

**ఫీజుల బకాయి — బీజేపీ లడాయి పోస్టర్ ఆవిష్కరణ**



విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ యువమోర్చా, మహిళా మోర్చా గత కొంతకాలంగా నిరంతరం పోరాడుతున్నాయని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడుతూ సోమవారం, మంగళవారం (24, 25 తేదీల్లో) రెండు రోజుల పాటు ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట భారీ దీక్షను చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫీజుల బకాయి – బీజేపీ లడాయి పోస్టర్ను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నేతృత్వంలో జరిగే ఈ దీక్షలో పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని విద్యార్థులకు అండగా నిలబడనున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భారీ సంఖ్యలో పాల్గొనలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఈ ప్రభుత్వ మెడలు వంచైనా సరే విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు దీర్ఘకాలం సురక్షితంగా కొనసాగుతుందా?

- **సమగ్ర శాస్త్రీయ అధ్యయనం అవసరం**
- **కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆస్తి**
- **ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగింది?**
- **సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
- **సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**

కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా సమగ్ర శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

### మేడిగడ్డ బ్యారేజీలో

వెలుగుచూసిన నిర్మాణపరమైన సమస్యలు కేవలం ఒక బ్యారేజీకి సంబంధించిన అంశంగా చూడకుండా.. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం దీర్ఘకాలిక భద్రత, నాణ్యత, జవాబుదారీతనానికి సంబంధించిన అంశంగా పరిశీలించాల్సి ఉందన్నారు. శనివారం మీడియాతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని పియర్లపై నిర్వహించిన కాంక్రీటు నాణ్యత పరీక్షల్లో కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ ( CW PRS) ఆందోళనకర ఫలితాలు నమోదైన నేపథ్యంలో, ప్రతి అంశాన్ని నిపుణుల సాంకేతిక పరిశీలన ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు."కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆస్తి. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగింది? నిర్మాణంలో ఎక్కడ లోపం జరిగింది? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై వాస్తవాలు ప్రజలకు తెలియాలి" అని మంత్రి అన్నారు.

### మేడిగడ్డపై పరీక్షా ఫలితాలను విస్మరించలేం

2023లో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లో 16 నుంచి 21వ పియర్ వరకు నిర్వహించిన కాంక్రీటు నాణ్యత పరీక్షల్లో పలు పియర్లకు సంబంధించి ప్రతికూల ఫలితాలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా 19వ పియర్‌లో 73.3 శాతం, 18వ పియర్‌లో 65.5 శాతం, 20వ పియర్‌లో 61.1 శాతం వరకు ప్రతికూల ఫలితాలు నమోదైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 17వ పియర్‌లో 50.5 శాతం, 21వ పియర్‌లో 49.9 శాతం, 16వ పియర్‌లో 41.3 శాతం వరకు ఫలితాలు నమోదయ్యాయని మంత్రి అడ్లూరి వివరించారు."ఈ ఫలితాలను సాధారణ గణాంకాలుగా తీసుకోలేమని .. ఇవి బ్యారేజీ గేట్లను మోసే కీలకమైన పియర్లకు సంబంధించినవనీ అందువల్ల వాటి ప్రభావం, నిర్మాణ భద్రతపై పూర్తి స్థాయి సాంకేతిక విశ్లేషణ అవసరం" అని మంత్రి అన్నారు.

### గేట్లను మోసే కీలక నిర్మాణాలు

మేడిగడ్డ బ్యారేజీలోని పియర్లు వరద ప్రవాహం, నీటి ఒత్తిడిని తట్టుకోవాల్సిన అత్యంత కీలక నిర్మాణ భాగాలని మంత్రి తెలిపారు.కాంక్రీటు అంతర్గత దృఢత్వం, ఏకరూపత, పగుళ్లు, ఖాళీలు తదితర అంశాలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న అల్ట్రాసోనిక్ ధ్వని తరంగ పరీక్షలు, రీబౌండ్ హ్యామర్ పరీక్షలు తదితర సాంకేతిక పరీక్షల ఫలితాలనుగా విశ్లేషించాల్సి ఉందన్నారు.

### నిర్మాణ సమయంలో నాణ్యత నియంత్రణ జరిగిందా?

భారీ నీటిపారుదల ప్రాజెక్టులో కాంక్రీటు మిశ్రమం, సిమెంట్, ఇసుక, కంకర నాణ్యత, నీటి పరిమాణం, కాంక్రీటు పోసే విధానం, తగినంత క్యూరింగ్ వంటి అంశాలు అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు.

### "నిర్మాణ సమయంలో నాణ్యతా నియంత్రణ వ్యవస్థలు సక్రమంగా పనిచేశాయా?

లోపాలను అప్పుడే గుర్తించి సరిదిద్దారా? కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షణ సంస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారా?" అని మంత్రి ప్రశ్నించారు.

### ప్రజాధనానికి జవాబుదారీతనం తప్పనిసరి

మేడిగడ్డ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టు కాబట్టి రాజకీయ కక్షతో విమర్శించడం లేదని మంత్రి స్పష్టం చేశారు."ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగింది? బాధ్యత ఎక్కడ ఉంది? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకోవాలి? అనే కోణంలో మా ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు.రాజకీయ నిర్ణయాలు తీసుకున్నవారు, నిర్మాణ బాధ్యతలు నిర్వహించినవారు, నాణ్యతను పర్యవేక్షించినవారు ఎవరైనా సరే.. నిపుణుల నివేదికలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా బాధ్యత నిర్ధారణ జరగాల్సిందేనని మంత్రి అడ్లూరి తెలిపారు.

### పునరుద్ధరణ అంటే కేవలం మరమ్మతులు కాదు

మేడిగడ్డ పునరుద్ధరణను కేవలం దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేయడంగా చూడకూడదని మంత్రి అన్నారు.బ్యారేజీ భవిష్యత్తులో భారీ వరదలను సురక్షితంగా తట్టుకోగలదా? నీటి ఒత్తిడిని భరించే సామర్థ్యం ఉందా? పునాది సామర్థ్యం ఎలా ఉంది? నిర్మాణం దీర్ఘకాలం సురక్షితంగా కొనసాగుతుందా? అనే అంశాలపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం అవసరమన్నారు. కేంద్ర సంస్థలు, నిపుణుల సూచనలు, సాంకేతిక పరీక్షల ఫలితాల ఆధారంగానే తదుపరి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. "సమస్యను దాచిపెట్టడం కాదు.. సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.


### కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆస్తి

కాళేశ్వరం ప్రాజెక్టు ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది తెలంగాణ ప్రజల ఆస్తి అని మంత్రి అన్నారు.గతంలో జరిగిన తప్పులను కప్పిపుచ్చబోమని, ప్రస్తుత పరిస్థితిని నిర్లక్ష్యం చేయబోమని, భవిష్యత్ తరాలకు ప్రమాదం కలిగేలా ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు."మాకు రాజకీయ ప్రతీకారం అవసరం లేదు. ప్రజలకు నిజం కావాలి.. ప్రాజెక్టుకు భద్రత కావాలి.. ప్రజాధనానికి రక్షణ కావాలి" అని మంత్రి అన్నారు.



### భవిష్యత్ తరాలకు భద్రతే లక్ష్యం

మేడిగడ్డపై వచ్చిన ప్రతి సాంకేతిక నివేదికను రాజకీయ కోణంలో కాకుండా ఇంజినీరింగ్, శాస్త్రీయ దృష్టితో పరిశీలించాలని మంత్రి అన్నారు.అసలు లోపం ఎక్కడ జరిగింది? ఎందుకు జరిగింది? బాధ్యత ఎవరిది? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోవాలి? అనే ప్రశ్నలకు నిపుణుల నివేదికల ద్వారా సమాధానాలు రావాల్సి ఉందన్నారు."మేడిగడ్డపై నిజం వెలుగులోకి రావాలి.. లోపాలకు బాధ్యత నిర్ణయించాలి.. బ్యారేజీకి శాశ్వత భద్రత కల్పించాలి. ఇదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తేల్చిచెప్పారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com